తెలంగాణ TELANGANA MUCHATLU

TELTEL/2023/88710

# ముచ్చట్లు

ఎడిటర్ : బొల్లెపాక రాజేష్

తెలుగు దిన పత్రిక

వరంగల్ | ఆదివారం-17-ఆగస్టు - 2025 | సంపుటి : 3 | సంచిక : 82 | పేజీలు - 8 | వెల : రూ 5 | www.telanganamuchatlu.in




## భారీ వర్షా లపై అప్రమత్తంగా ఉండాలని సీఎం ఆదేశాలు



- 15 జిల్లాల్లో అధిక వర్షపాతం నమోదు, మిగతా జిల్లాల్లో సాధారణ వర్షా లు
- ఎస్‌డీఆర్‌ఎఫ్, ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలను ముందుగానే మోహరించిన ప్రభుత్వం
- లోతట్టు ప్రాంతాల ప్రజలను శిబిరాలకు తరలించాలని సూచనలు
- అన్ని శాఖల సమన్వయంతో సహాయక చర్యలు చేపట్టాలని ఆదేశాలు

2లో



# తెలంగాణను ప్రపంచంలోనే అత్యుత్తమ రాష్ట్రంగా తీర్చిదిద్దడమే నా జీవిత లక్ష్యం

## సీఎం రేవంత్ రెడ్డి

2లో

- అభివృద్ధి అంటే పేదవాడు ఆత్మగౌరవంతో నిలబడగలగడం
- తొలి విడతగా 4 లక్షల మందికి ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం ప్రారంభం
- సన్నబియ్యం సరఫరా, రేషన్ కార్డుల పంపిణీతో ప్రజల కష్టాలకు ఉపశమనం
- 2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దుతాం



## గిరిజన హక్కుల కోసం అంకితమైన శిబు సోరెన్ స్ఫూర్తిగా నిలుస్తారు

2లో

## మార్వాడీలు మనలో ఒకరు


- వారిని వెళ్లగొట్టే హక్కు ఎవరికీ లేదు
- బీసీ రిజర్వేషన్ల విషయంలో వెనక్కి తగ్గేది లేదన్న మహేశ్ కుమార్ గౌడ్
- రాజగోపాల్ రెడ్డి ఏ ఉద్దేశంతో మాట్లాడారో తెలుసుకుంటామని వెల్లడి

2లో





## గంజాయి మత్తులో యువత



- ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నా ఆగని సరఫరా
- తరచూ వెలుగు చూస్తున్న గంజాయి కేసులు
- గంజాయిని అరికట్టేందుకు టీజీన్యాబ్ ఏర్పాటు
- మత్తుకు బానిసలై అక్రమాలు చేస్తున్న యువత

హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)

గంజాయి దీని గురించి ప్రత్యేకంగా చెప్ప నవసరం లేదు. ఎందుకంటే, ఇదివరకు పట్టణాల్లో అక్కడక్కడ మాత్రమే దొరికే ఈ మత్తు పదార్థం. నేడు గ్రామాల్లోనూ విరివిగా లభిస్తోంది.

మిగతా 3లో

## 454 చోట్ల ఆర్ అండ్ బీ రోడ్లు దెబ్బతిన్నాయి


- రోడ్ల డ్యామేజీపై మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి సమీక్ష..



హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)

భారీ వర్షాల కారణంగా రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన రోడ్ల డ్యామేజీపై అధికారులతో మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భం గా ఆయన మాట్లాడారు.

మిగతా 2లో



## 20రోజులు రెక్కీ చేసి దోపిడీకి ప్లాన్

- చందానగర్‌లోని ఖజానా జ్యువెలరీ దోపిడీ కేసును ఛేదించిన పోలీసులు
- కేసు వివరాలు మీడియాకు వెల్లడిరచిన మాదాపూర్ డీసీపీ వినీత్

3లో

## రేవంత్ రెడ్డికి విషం ఎక్కువ.. విషయం తక్కువ



- ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్
- స్వాతంత్ర్య దినోత్సవం, క్రెడాయ్ కార్యక్రమాల్లో సొల్లు పురాణం చెప్పారని విమర్శ
- మధ్యతరగతి వాడినని చెప్పకుంటూ విలాస వస్తువులు వాడుతున్నారని ఎద్దేవా
- బ్రాండ్ హైదరాబాద్ క్రియేట్ చేసిందే కేసీఆర్, కేటీఆర్.. కానీ రేవంత్ చేతుల్లో ఇమేజ్ దెబ్బతింది

హైదరాబాద్,తెలంగాణ ముచ్చట్లు:

సీఎం రేవంత్ సర్కార్‌పై ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ తీవ్ర స్థాయిలో విమర్శ లు గుప్పించారు. తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా గోల్కొండలో, క్రెడాయక్ కార్యక్రమం లో సీఎం రేవంత్ సొల్లు పురాణం చె ప్పారని విమర్శించారు. రేవంత్ రెడ్డికి విషం ఎక్కువ.. విషయం తక్కువ.. అని ఎద్దేవా చేశారు. మధ్యతరగతి వాడినని చెప్పుకునే రేవంత్ రెడ్డి.. తన బూట్లు, బెల్ట్, టీ షర్టులు ఎంత విలువనో చె ప్పాలని డిమాండ్ చేశారు. ఇతర వ్యా పారాల మీద ఉన్న యావ రేవంత్‌కు ఇంగ్లీష్ నేర్చుకోవటంలో లేదన్నారు. తెలంగాణలో నిర్మాణ రంగం కుదేల వటానికి ముఖ్య కారణం రేవంత్ రెడ్డి అని దాసోజు శ్రవణ్ ఆరోపించారు.

మిగతా 2లో



## సృష్టి ఫెర్టిలిటీ కేసులో నేరం ఒప్పకున్న డాక్టర్ నమ్రత

- గర్భిణులకు డబ్బు ఆశచూపి శిశువుల కొనుగోలు
- ఒక్కో శిశువును రూ . 20 నుంచి 30 లక్షలకు విక్రయం
- గతంలోనూ పలు పోలీస్ స్టేషన్లలో కేసులు ఉన్నట్లు వెల్లడి

2లో





## కాళేశ్వరం-పోలవరం ప్రాజెక్టులపై రెండు విధానాలా..?

- రెండోసారి కొట్టుకుపోయిన పోలవరం కాఫర్ డ్యామ్ పై ఎన్డిఏ, ఎన్డిఎస్ఏ మౌనం ఎందుకని ప్రశ్న
- మేడిగడ్డ పిల్లర్లపై వెంటనే దర్యాప్తు.. పోలవరం విషయంలో నిశ్శబ్దం ఎందుకు?
- తెలంగాణ రైతును దేశానికి అన్నం పెట్టే స్థాయికి చేర్చిన కాళేశ్వరం ప్రాజెక్టుపై కుట్రల ఆరోపణలు
- జీవనాడి ప్రాజెక్టును కాపాడుకుంటామంటూ కాంగ్రెస్, బీజేపీలపై బీఆర్ఎస్ ప్రతిఘటన
- మాజీ మంత్రి కేటీఆర్ ట్విట్టర్‌లో ప్రశ్నలు



హైదరాబాద్,తెలంగాణ ముచ్చట్లు:

బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ అధ్యక్షుడు కేటీఆర్ ట్విట్టర్‌లో పోలవరం, కాళేశ్వరం అంశంపై పలు ప్రశ్నలు లేవనెత్తారు. జాతీయ హోదా ఇచ్చి నిర్మిస్తున్న పోలవరం ప్రాజెక్టులో కాఫర్ అడ్డంకి రెండోసారి గోదావరిలో కొట్టుకుపోయినా జలభద్రతా సంస్థకు కనిపించడం లేదా? అని ప్రశ్నించారు.

మిగతా 2లో

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# భారీ వర్షా లపై అప్రమత్తంగా ఉండాలని సీఎం ఆదేశాలు

**హైదరాబాద్,తెలంగాణ ముచ్చట్లు:**



రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో అన్ని శాఖల అధికారులు, సిబ్బంది మరింత అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. వాతావరణ శాఖ హెచ్చరికల ప్రకారం నిజామాబాద్, సంగారెడ్డి, మెదక్, వికారాబాద్, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల్లో మోస్తరు నుండి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ఉదయం ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి సమావేశమయ్యారు.

వాతావరణ శాఖ అందించిన నివేదిక ప్రకారం 15 జిల్లాల్లో అధిక వర్షపాతం నమోదైనట్లు, మిగతా జిల్లాల్లో సాధారణ వర్షాలు కురిశాయని తెలిపారు. వర్ష ప్రభావం ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో ఎస్‌డీఆర్‌ఎఫ్, ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలను ముందుగానే మోహరించామని, కలెక్టర్లతో సమన్వయం చేసుకుని సహాయక చర్యలు చేపట్టాలని సూచించారు.

వాగులు, వంకలు పొంగే ప్రమాదం ఉన్న ప్రాంతాల్లో అధికారులు అప్రమత్తంగా ఉండాలని, లోతట్టు ప్రాంతాల ప్రజలను ముందుగానే సహాయక శిబిరాలకు తరలించాలని ఆదేశించారు. నీటి పారుదల శాఖ రిజర్వాయర్లు, చెరువులు, కుంటల నీటి మట్టాన్ని పరిశీలిస్తూ నీటి విడుదలపై కలెక్టర్లకు సమయానుకూల సమాచారం అందించాల్సిందిగా చెప్పారు. నిండిన చెరువులు, రిజర్వాయర్ల వద్ద ఇసుక బస్తాలు సిద్ధంగా ఉంచాలని సూచించారు.

రోడ్లపై నీరు నిలిచిన ప్రాంతాల్లో, లో లెవల్ బ్రిడ్జిలు, కాజ్‌వేలపై రాకపోకలు పూర్తిగా నిషేధించాలని, వాటి వద్ద పోలీసులు, రెవెన్యూ అధికారులు బారికేడ్లు ఏర్పాటు చేసి పర్యవేక్షించాలని ఆదేశించారు. వర్షపు నీరు నిల్వ ఉండటం వల్ల దోమలు, క్రిమికీటకాలు పెరగడం ద్వారా అంటువ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉన్నందున పారిశుధ్య సిబ్బంది ఎప్పటికప్పుడు శుభ్రత పనులు చేపట్టాలని చెప్పారు.

వైద్యారోగ్య శాఖ తగినంత మందులు సిద్ధంగా ఉంచుకోవాలని, అవసరమైతే వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రాణ నష్టం, ఆస్తి నష్టం, పశు నష్టం జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. రెవెన్యూ, విద్యుత్, పంచాయతీరాజ్, ఆర్ అండ్ బీ, వైద్యారోగ్య, పురపాలక, పోలీస్, అగ్నిమాపక శాఖలు, ఎస్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు.

హైదరాబాద్ నగరంలో ప్రజల నుంచి వచ్చే వినతులకు జీహెచ్‌ఎంసీ, హైడ్రా, ఎస్‌డీఆర్‌ఎఫ్, అగ్నిమాపక శాఖ సిబ్బంది తక్షణమే స్పందించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.



## తెలంగాణను ప్రపంచంలోనే అత్యుత్తమ రాష్ట్రంగా
# తీర్చిదిద్దడమే నా జీవిత లక్ష్యం

**హైదరాబాద్,తెలంగాణ ముచ్చట్లు:**

ప్రజల సమస్యలను పరిష్కరించడం, రాష్ట్ర అభివృద్ధి కోసం తన జీవితాన్ని అంకితం చేయడం తనకున్న ఏకైక ఆశయమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ప్రపంచంలోనే ఒక గొప్ప అభివృద్ధి చెందిన రాష్ట్రంగా తెలంగాణను తీర్చిదిద్దడమే తన లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు.

హైదరాబాద్‌లోని టీజీ జెన్కో ఆడిటోరియంలో వాక్కులమ్మ ప్రచురణ నుంచి వెలువడిన 'హసిత బాష్పాలు' (కావ్యరూపం) పుస్తకా విష్కరణ కార్యక్రమంలో ఆయన పాల్గొని, పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రచయిత శ్రీరామ్, ప్రజా కవి అందెశ్రీని అభినందించారు.

**ముఖ్యమంత్రి మాట్లాడుతూ..**

"సాధారణ వ్యవసాయ మధ్యతరగతి కుటుంబం నుంచి వచ్చిన నేను, 4 కోట్ల ప్రజల సంక్షేమం కోసం పనిచేయడమే నా ధ్యేయం. ఎవరు నచ్చలేదని అధికారాన్ని వినియోగించడం మూర్ఖత్వం. నేను ఎవరినీ శత్రువుగా చూడను. కర్మ సిద్ధాంతాన్ని నమ్ముతాను. 2006లో జెడ్పీటీసీ సభ్యుడిగా, 2007లో ఎమ్మెల్సీగా, 2009లో ఎమ్మెల్యేగా, 2014లో ఎంపీగా, 2023లో సీఎం అయ్యే వరకూ ప్రజలు నాకు పదవులను అప్పగించారు. మంత్రి పదవి చేపట్టకుండానే సీఎం అయ్యానంటే, అది భగవంతుడి నిర్ణయం, ప్రజల విశ్వాసం" అని తెలిపారు.

అంబేద్కర్ భావజాలాన్ని గుర్తుచేసుకుంటూ, "అభివృద్ధి అంటే అద్దాల మేడలు, రంగుల గోడలు కాదు. పేదవాడు సొంతింటి కల నిజం చేసుకున్నప్పుడే ఆత్మగౌరవంతో నిలబడగలుగుతాడు. అందుకోసమే తొలి విడతగా 4 లక్షల మందికి ఇందిరమ్మ ఇండ్లు అందిస్తున్నాం. ఈరోజు రాష్ట్రంలో 3.10 కోట్ల మందికి సన్నబియ్యం అందిస్తున్నాం. రేషన్ కార్డులు రాక బాధపడుతున్న వారికి ప్రభుత్వం ఇప్పుడు కార్డులు ఇస్తోంది. పేదవాడి ఆత్మగౌరవమే మా ప్రాధాన్యం" అని చెప్పారు.

కవుల ప్రాధాన్యాన్ని ప్రస్తావిస్తూ.. "అంజన్న, దాశరధి కృష్ణమాచార్య, కాళోజీ, అందెశ్రీ, గద్దర్, గోరటి వెంకన్న వంటి మహనీయులు సమాజానికి చైతన్యం నింపారు. ఉద్యమకారులెవరూ తమను తాము ఉద్యమకారులమని చెప్పుకోరు. నిజమైన ఉద్యమకారులు ఆస్తులు, అంతస్తులు కోల్పోయినా ప్రజలకు ప్రేరణనిచ్చారు. అందెశ్రీ, గద్దర్ లాంటి వారు ఎలాంటి స్వప్రయోజనం లేకుండా నడిచారు" అని ముఖ్యమంత్రి అన్నారు. దేశ స్వాతంత్ర్యం వందేళ్లు పూర్తయ్యే 2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని, అందుకోసం నిరంతరం శ్రమిస్తానని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి కార్యాలయం ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీనివాస రాజు, రచయిత శ్రీరామ్, ప్రజా కవి అందెశ్రీ, డాక్టర్ నోరి దత్తాత్రేయుడు, రామకృష్ణానందతో పాటు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

# గిరిజన హక్కుల కోసం అంకితమైన శిబు సోరెన్ స్ఫూర్తిగా నిలుస్తారు

- గిరిజన హక్కుల కోసం అంకితమైన శిబు సోరెన్ స్ఫూర్తిగా నిలుస్తారు
- తెలంగాణ సిఎం రేవంత్ రెడ్డి

**జార్ఖండ్,తెలంగాణ ముచ్చట్లు:**



దేశం గర్వించదగిన గిరిజన నేత, దిషోం గురు, జార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి శిబు సోరెన్ కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నివాళులర్పించారు. జార్ఖండ్ రామ్‌గఢ్ జిల్లాలోని నమ్రా గ్రామంలో సంప్రదాయ గిరిజన ఆచారాలతో నిర్వహించిన శ్రద్ధాంజలి కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు.

ఈ సందర్భంగా శిబు సోరెన్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి ఆయన సేవలను స్మరించారు. జార్ఖండ్ మాత్రమే కాకుండా దేశంలోని గిరిజన, అణగారిన వర్గాల పక్షాన శిబు సోరెన్ బలమైన స్వరం వినిపించారని, ఆయన జీవితం ఆ వర్గాల కోసం అంకితం అయ్యిందని పేర్కొన్నారు. గిరిజన సమాజ ప్రయోజనాల కోసం ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని తెలిపారు. శిబు సోరెన్ కుమారుడు, జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్‌తో పాటు కుటుంబ సభ్యులకు రేవంత్ రెడ్డి సంతాపాన్ని తెలియజేశారు.

# మార్వాడీలు మనలో ఒకరు

(మొదటి పేజీ తరువాయి)



మార్వాడీ గో బ్యాక్ అంశంపై, ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి వ్యాఖ్యలపై తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ స్పందించారు. మార్వాడీలు మన దేశానికి చెందినవారని, వారంతా మనలో ఒకరని, అలాంటి వారిని వెళ్లగొట్టే హక్కు ఎవరికీ లేదని ఆయన స్పష్టం చేశారు. బీసీ రిజర్వేషన్ల విషయంలో వెనక్కి తగ్గే ప్రసక్తి లేదని ఆయన తేల్చి చెప్పారు. కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి వ్యవహారంపై ఆయన స్పందిస్తూ.. రాజగోపాల్ రెడ్డి ఏ ఉద్దేశంతో మాట్లాడారో తెలుసుకుంటామని వెల్లడిరచారు. ఈ వ్యవహారాన్ని క్రమశిక్షణ కమిటీ చూసుకుంటుందని తెలిపారు. తనకు మంత్రి పదవి ఇస్తామనే హామీతోనే పార్టీలో తిరిగి చేర్చుకున్నారని, తాను పార్టీలో చేరినప్పుడు ఇద్దరం అన్నదమ్ములం ఉన్నామనే విషయం తెలియదా అని రాజగోపాల్ రెడ్డి వ్యాఖ్యానించిన విషయం తెలిసిందే. ఈ వ్యాఖ్యలపై టీపీసీసీ చీఫ్ పైవిధంగా స్పందించారు.

## 454 చోట్ల ఆర్ అండ్ బీ రోడ్లు
# దెబ్బతిన్నాయి

(మొదటి పేజీ తరువాయి)



వరద ప్రవాహాలకు రాష్ట్ర వ్యాప్తంగా 454 చోట్ల ఆర్ అండ్ బీ రోడ్లు దెబ్బతిన్నాయని తెలిపారు. 629 కిలో మీటర్ల రోడ్డు దెబ్బతిన్నట్లు అధికారులు నివేదిక ఇచ్చినట్లు చెప్పారు. రోడ్ల మరమ్మత్తులపై పనులు ప్రారంభించినట్లు పేర్కొన్నారు. గత ప్రభుత్వం వేసిన నాణ్యతా రహిత రోడ్ల వల్లే ఇలాంటి పరిస్థితులు ఏర్పాడ్డాయని ఆరోపించారు.

భారీ వర్షాల కారణంగా 22 చోట్ల రోడ్లు తెగిపోతే వెంటనే 4 చోట్ల తాత్కాలిక పునరుద్ధరణ చేసినట్లు మంత్రి వెంకట్ రెడ్డి చెప్పుకొచ్చారు. 171 చోట్లలో ఇంకా కాజ్ వే, కల్వర్టులు వద్ద వరద ప్రవాహం ఉన్నట్లు పేర్కొన్నారు. 108 రాకపోకలకు ఇబ్బంది ఉన్న ప్రాంతాలను గుర్తించినట్లు చెప్పారు. 71 చోట్ల క్లియర్ చేయగా.. మిగతా చోట్ల సహాయక చర్యలు కొనసాగిస్తున్నట్లు వివరించారు. వాగుల వెంట 58 కి.మీ రోడ్డు కోతకు గురైందని, అందులో 378 మీటర్లు రోడ్డును ప్రభుత్వం మూసివేసిందని తెలిపారు. మొత్తంగా 147 చోట్లలో కాజ్ వే, మైనర్ బ్రిడ్జిలు, కల్వర్టులు తాత్కాలికంగా, శాశ్వతంగా పునరుద్ధరించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టనున్నట్లు వెల్లడిరచారు. భారీ వర్షాల దృష్ట్యా ప్రజలు అవసరమైతే తప్ప రావొద్దని మంత్రి సూచించారు.

## రేవంత్ రెడ్డికి విషం ఎక్కువ..
# విషయం తక్కువ

(మొదటి పేజీ తరువాయి)



బ్రాండ్ హైదరాబాద్ క్రియేట్ చేసిందే కేసీఆర్, కేటీఆర్ అని తెలిపారు. నిర్మాణరంగానికి ముఖ్యమంత్రి నమ్మకం కల్పించలేకపోయారని పేర్కొన్నారు. బాధ్యత లేని వ్యక్తి ముఖ్యమంత్రి కుర్చీలో కూర్చుంటే ఎలా ఉంటుందో చూస్తున్నామని విమర్శించారు. కుక్కతోక వంకర మాదిరి రేవంత్ రెడ్డి వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. పోలీసులను వాడుకుని రేవంత్.. బీఆర్ఎస్ నేతలను హింసిస్తున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. రేవంత్ రెడ్డికి విజన్ లేదు.. విజ్డం లేదని శ్రవణ్ ఆరోపించారు. ఎంత సేపు కేసీఆర్‌ను తిట్టడం, చంద్రబాబును పొగడటం తప్ప ఆయనకు ఏదీ చేత కాదని విమర్శించారు. హైదరాబాద్ అనేది రెవెన్యూ ఇంజిన్ అని పేర్కొన్నారు. నిర్మాణ రంగం బాగుంటేనే అన్ని బాగుంటాయని సూచించారు. కేసీఆర్, కేటీఆర్‌ల చొరవతో హైదరాబాద్ పెట్టుబడులకు గమ్యస్థానంగా మారిందన్నారు. హైదరాబాద్ ఇమేజ్ రేవంత్ పాలనలో డ్యామేజీ అయ్యిందని అసహనం వ్యక్తం చేశారు. జీహెచ్‌ఎంసీలో భవన నిర్మాణ అనుమతులు తగ్గిపోయాయని పేర్కొన్నారు. హెచ్‌ఎండీఏలో కార్యకలాపాలు పడకేశాయని తెలిపారు. రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీని అడ్డం పెట్టుకుని రేవంత్ బిల్డర్లను బెదిరిస్తున్నారని దాసోజు శ్రవణ్ ధ్వజమెత్తారు.

## కాళేశ్వరం-పోలవరం ప్రాజెక్టులపై
# రెండు విధానాలా..?

(మొదటి పేజీ తరువాయి)



కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ వద్ద రెండు స్తంభాలకు పగుళ్లు వస్తే "కూలేశ్వరం" అంటూ కూతలు కూసిన కాంగ్రెస్, బీజేపీ నేతలకు పోలవరంపై మాత్రం మాటదమ్ము లేదని నిలదీశారు. ఒకే నీటి ప్రాజెక్టుల విషయంలో తెలంగాణకు ఒక తీరు, ఆంధ్రప్రదేశ్‌కు మరో తీరు ఎందుకు అనుసరిస్తున్నారని ప్రశ్నించారు.

అసెంబ్లీ ఎన్నికల సమయంలో మేడిగడ్డ పిల్లర్లు కుంగిపోతే 24 గంటల్లోపే జలభద్రతా సంస్థను దింపిన బీజేపీ నేతలు... ఏకంగా పది అడుగుల వెడల్పు, ఎనిమిది అడుగుల లోతుకు కూలిపోయిన పోలవరం కాఫర్ అడ్డంకి విషయంలో ఎందుకు మౌనంగా ఉన్నారని కేటీఆర్ ట్విట్టర్‌లో ఎత్తిచూపారు. 2020లో పోలవరం డయాఫ్రం గోడ రెండేండ్లకే కొట్టుకుపోయినా ఎలాంటి స్పందన రాకపోవడం, తాజాగా మళ్లీ కాఫర్ అడ్డంకి గోదావరిలో కొట్టుకుపోయినా ఇప్పటికీ జలభద్రతా సంస్థ ఆచూకీ లేకపోవడం పట్ల కేటీఆర్ ట్విట్టర్‌లో ప్రశ్నించారు. ఎస్.ఎల్.బీ.సీ. సొరంగం కూలిపోవడంతో ఎనిమిది మంది ప్రాణాలు కోల్పోయినా స్పందించకపోవడం కేంద్రం నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు. దేశానికే అన్నం పెట్టే స్థాయికి రైతును చేర్చిన కాళేశ్వరం ప్రాజెక్టుపై కక్షతో కుట్రలు సాగిస్తున్న కాంగ్రెస్-బీజేపీ నేతలను ప్రజలు గమనిస్తున్నారని, తెలంగాణ జీవనాడి అయిన ఈ ప్రాజెక్టును కంటికి రెప్పలా కాపాడుకుంటామని కేటీఆర్ ట్విట్టర్‌లో స్పష్టం చేశారు.

# సృష్టి ఫెర్టిలిటీ కేసులో నేరం ఒప్పుకున్న డాక్టర్ నమ్రత

**హైదరాబాద్,తెలంగాణ ముచ్చట్లు:**

తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన సికింద్రాబాద్ సృష్టి ఫెర్టిలిటీ సెంటర్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో ప్రధాన నిందితురాలైన డాక్టర్ నమ్రత, విచారణలో తన నేరాన్ని అంగీకరించినట్లు పోలీసులు వెల్లడిరచారు. సరోగసీ ముసుగులో ఆమె నడిపిన శిశువుల క్రయవిక్రయాల దందాకు సంబంధించిన షాకింగ్ నిజాలు ఆమె వాంగ్మూలంతో బయటపడ్డాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, డాక్టర్ నమ్రత ఒక వ్యవస్థీకృత నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేసుకుని ఈ మోసాలకు పాల్పడ్డారు. సికింద్రాబాద్‌తో పాటు విజయవాడ, విశాఖపట్నంలోనూ ఫెర్టిలిటీ సెంటర్లను నిర్వహిస్తూ, సంతానం లేని దంపతులను లక్ష్యంగా చేసుకున్నారు. సరోగసీ ద్వారా పిల్లలను అందిస్తామని నమ్మించి, వారి నుంచి రూ. 20 లక్షల నుంచి రూ. 30 లక్షల వరకు భారీ మొత్తంలో డబ్బు వసూలు చేసినట్లు ఆమె అంగీకరించారు. ఈ దందా కోసం ప్రత్యేకంగా ఏజెంట్లను నియమించుకుని, ఆర్థికంగా వెనుకబడిన గర్భిణులను గుర్తించేవారని విచారణలో తేలింది. వారికి డబ్బు ఆశ చూపి, ప్రసవం తర్వాత బిడ్డను తమకు అప్పగించేలా ఒప్పందాలు చేసుకునేవారు. అలా కొనుగోలు చేసిన శిశువులను, తమ వద్దకు వచ్చిన దంపతులకు సరోగసీ ద్వారా జన్మించినట్లుగా నమ్మించి అప్పగించేవారని డాక్టర్ నమ్రత తన నేరాంగీకార పత్రంలో పేర్కొన్నట్లు సమాచారం. తనపై గతంలోనూ పలు పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదైన విషయాన్ని కూడా ఆమె ఒప్పుకున్నారని అధికారులు తెలిపారు. ఈ కేసులో మరింత లోతుగా దర్యాప్తు జరిపి, నెట్‌వర్క్‌లోని ఇతర సభ్యులను గుర్తించే పనిలో పోలీసులు నిమగ్నమయ్యారు.



# గంజాయి మత్తులో యువత

(మొదటి పేజీ తరువాయి)



దీంతో ఎంతోమంది యువత ఈ మత్తుకు బానిసై భవిష్యత్తును అంధకారంలోకి నెట్టుకుంటున్నారు. అక్రమార్జనకు అలవాటు పడ్డ కొందరు చాక్లెట్ల మాదిరి ఎక్కడిక్కడ గంజాయి అమ్మేస్తుంటే మరికొందరు చాక్లెట్ల రూపంలో దీన్ని విక్రయిస్తున్నారు. ఇలా వివిధ రూపాల్లో గంజాయి యువత చెంతకు చేరుతూ వారిని పెడదారి పట్టిస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా నిత్యం వెలుగులోకి వస్తున్న గంజాయి కేసులే ఇందుకు నిదర్శనం. ప్రభుత్వం, అధికారులు, పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నా గంజాయి సరఫరాకు మాత్రం అడ్డుకట్ట వేయలేకపోతున్నారు. దీంతో యువత గంజాయి మత్తులో పడి కేసుల్లో చిక్కుకోవడమే గాక, అక్రమాలు, దొంగతనాలు సహా అనేక నేరాలకు పాల్పడుతున్నారు. మరి, ఈ గంజాయిని అడ్డుకునే మర్గాలే లేవా? ఈ మత్తుకు బానిస కావడానికి గల కారణాలేంటి గంజాయి సరఫరాను అడ్డుకునేందుకు అధికారులు తీసుకుంటున్న చర్యలేంటి?.

మద్యపానం దూమపానం ఆరోగ్యానికి హానికరం! కానీ, వీటికి మించిన ప్రమాదకర, హానికర పదార్థాలు డ్రగ్స్, హెరాయిన్, కొకైన్, హాష్ ఆయిల్, గంజాయి, హైడ్రోఫోనిక్ గంజాయి. ఒక్కసారి వీటికి అలవాటు పడితే అంతే సంగతి. బానిసలుగా మార్చుకుని భవిష్యత్తును నాశనం చేసేదాకా ఈ మత్తు పదార్థాలు వదలవు. వాటిని తీసుకోకపోతే చచ్చిపోతామేమోనన్న భ్రమలోకి తీసుకుపోయి మానసికంగా, శారీరకంగా ఎంతో కుంగదీస్తాయి. విచక్షణ కోల్పోయి వింతగా ప్రవర్తించే స్థాయికి దిగజారుస్తాయి. ఇందుకు చాలా ఉదాహరణలే ఉన్నాయి. ముఖ్యంగా యువత వీటి మత్తులో చిక్కుకుని వారి భవితను చేజేతులా నాశనం చేసుకుంటుండటం ఆందోళన కలిగిస్తోంది. చవకగా దొరుకుందని చెప్పి విచ్చల విడిగా కొనుగోలు చేస్తూ బానిసలుగా మారుతున్నారు. ఫలితంగా రాష్ట్రంలోకి ఎక్కడెక్కడి నుంచో గంజాయి వచ్చి చేరుతోంది. అధికారులు ఎంత అడ్డుకున్నా అది యువత చేతుల్లోకి చేరుతోంది.

రాష్ట్రంలో ఎక్కడో ఒక చోట గంజాయిని తరచూ పోలీసులు పట్టుకుంటూనే ఉన్నారు. సరఫరాను అడ్డుకుంటూ బాధ్యులపై చర్యలు తీసుకుంటున్నారు. ఐనా, గంజాయి సరఫరాకు అడ్డుకట్ట పడడం లేదు. ఇటీవల బ్యాంకాక్ నుంచి వచ్చిన ఓ ప్రయాణికురాలి వద్ద నుంచి రూ. 13.3 కోట్ల విలువైన 13.3 కిలోల హైడ్రోఫోనిక్ గంజాయిని డీఆర్ఐ అధికారులు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. జులై 30న కూడా బ్యాంకాక్ నుంచి వచ్చిన ఓ మహిళ దగ్గర నుంచి రూ. 40 కోట్ల విలువ చేసే 400 కేజీల హైడ్రోఫోనిక్ గంజాయిని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. తెలంగాణలోకి దేశ విదేశాల నుంచి గంజాయి సరఫరా అవుతోందని పోలీసు అధికారులు చెబుతున్నారు. ప్రధానంగా బ్యాంకాక్, నైజీరియా, థాయ్‌లాండ్, మలేషియా సహా ఇతర దేశాల నుంచి గంజాయి రాష్ట్రంలోకి చేరుతోందని అంటున్నారు. విదేశాలతో పాటు ఒడిశా, తమిళనాడు, మహారాష్ట్ర తోపాటు ఏపీ నుంచి కొంత మేర గంజాయి రాష్ట్రంలోకి సరఫరా అవుతోందని అధికారిక గణాంకాలు చెబుతున్నాయి. అయితే ఆ రాష్ట్రాల్లోని అటవీ ప్రాంతాల్లో గంజాయి సాగు చేస్తున్న అనుమానితుల జాబితాను తెలంగాణ పోలీసులు అక్కడి పోలీసులకు అందించినట్లు సమాచారం. అందులో ఏపీలో 230 మంది, ఒడిశాలో 100 మంది, తమిళనాడులో 35 మంది ఉన్నట్లు తెలుస్తోంది. వీరంతా గంజాయిని తరలించడానికి, రోడ్డు మార్గాలతో పాటు ప్రధానంగా రైలు మార్గాలను ఎంచుకున్నట్లు పోలీసులు ప్రాథమికంగా గుర్తించారు.

# 20రోజులు రెక్కీ చేసి దోపిడీకి ప్లాన్

- చందానగర్‌లోని ఖజానా జ్యువెలరీ దోపిడీ కేసును ఛేదించిన పోలీసులు
- ఇద్దరు అరెస్టు
- కేసు వివరాలు మీడియాకు వెల్లడిరచిన మాదాపూర్ డీసీపీ వినీత్

హైదరాబాద్,తెలంగాణ ముచ్చట్లు:



హైదరాబాద్ చందానగర్‌లోని ఖజానా జ్యువెలరీ దోపిడీ కేసును పోలీసులు ఛేదించారు. నిందితులను అదుపులోకి తీసుకున్నారు. నిందితుల నుంచి బులెట్లు, నాటు తుపాకులు స్వాధీనం చేసుకున్నారు. ఖజానా జ్యువెలరీ దోపిడీ కేసు వివరాలను మాదాపూర్ డీసీపీ వినీత్ మీడియా సమావేశం నిర్వహించి తెలిపారు. చందానగర్ ఖజానా దోపిడీ కేసులో ఇద్దర్ని అరెస్టు చేశామని, ప్రధాన నిందితులు దీపక్, ఆశిష్‌ను పుణెలో పట్టుకున్నామని తెలిపారు. చోరీ కేసులో మొత్తం ఏడుగురు నిందితులను గుర్తించామని, నిందితులంతా బీహార్ వాసులుగా గుర్తించామని అన్నారు. నిందితుల నుంచి గోల్డ్ కోటెడ్ సిల్వర్ వస్తువులు స్వాధీనం చేసుకున్నామని, 20 రోజుల క్రితం హైదరాబాద్ నగరానికి వచ్చి పలు నగల దుకాణాలను పరిశీలించారని వివరించారు. ఆగస్టు 12న చందానగర్‌లోని ఖజానా జ్యువెలరీలో చోరీ జరిగిందని వినీత్ గుర్తు చేశారు. నిందితులు ఖజానా జ్యువెలరీ వద్ద 20 రోజులు రెక్కీ నిర్వహించారని, ఖజానా జ్యువెలరీలో దోపిడీకి మొత్తం ఏడుగురు వ్యక్తులు వచ్చారని, బైకులపై వచ్చి దోపిడీ చేసి మళ్లీ బైకులపైనే పరారయ్యారని తెలిపారు. ఫేక్ నంబర్ ప్లేట్లతో వచ్చి చోరీకి పాల్పడి తర్వాత నంబర్ ప్లేట్లు మార్చుకున్నారని, భద్రతా సిబ్బంది ఎక్కువగా లేని దుకాణాన్ని ఎంచుకుని దోపిడీకి పాల్పడ్డారని గుర్తు చేశారు. పారిపోవడానికి సులభంగా ఉందని నగర శివారులోని దుకాణాన్ని ఎంచుకున్నారని, 10 కిలోల వెండి ఆభరణాలు, వస్తువులు ఎత్తుకొని పరారీ అయ్యారని చెప్పారు.

బంగారంగా భావించి బంగారం పూత పూసిన వెండి వస్తువులను ఎత్తుకెళ్లారని, ఈ బిహార్ ముఠా హైదరాబాద్‌లో చేసిన తొలి చోరీ ఇదని, గతంలో కోల్‌కతా, బీహార్, కర్ణాటకలో దోపిడీలకు పాల్పడినట్లు గుర్తించామని, రెండేళ్లుగా హైదరాబాద్‌లో ఉంటూ చిన్నచిన్న ఉద్యోగాలు చేసుకుంటూ ఉన్నారని వెల్లడిరచారు. ఇతర రాష్ట్రాల కూలీలను నియమించుకునే వాళ్లు జాగ్రత్తగా ఉండాలని, కూలీలకు ఏమైనా నేర చరిత్ర ఉందా అని యజమానులు ఆరా తీయాలని వినీత్ సూచించారు. లేబర్ సప్లయ్ ఏజెన్సీలు తమ వద్దకు వస్తున్న వారి వివరాలను మాకు ఇస్తే బాగుంటుందని, హైదరాబాద్ నగరానికి వచ్చే అందరి సమాచారం పోలీసులకు అందటం చాలా కష్టమని పేర్కొన్నారు.

`ఆరోజు అసలేం జరిగింది

చందానగర్‌లో ఈ నెల 12 న ఖజానా జ్యువెలరీ దుకాణంలో దుండగులు దోపిడీకి పాల్పడ్డారు. ఎదురుతిరిగిన సిబ్బందిపై కాల్పులు జరిపారు. ఆరుగురు దుండగులు 2 రౌండ్ల ఫైరింగ్ జరిపారు. తుపాకీ పేల్చి సీసీ కెమెరాలను ధ్వంసం చేశారు. ఈ ఘటనలో డిప్యూటీ మేనేజర్ కాలికి గాయాలు అయ్యాయి. తొలుత తుపాకీతో బెదిరించిన దుండగులు సిబ్బందిని లాకర్‌కీ అడిగారు. వారు కీ ఇవ్వకపోవడంతో డిప్యూటీ మేనేజర్‌పై కాల్పులు జరిపారు. లోపల బంగారు ఆభరణాలకు సంబంధించిన స్టాల్స్ విరగ్గొట్టి సిబ్బందిపై దాడులకు సైతం పాల్పడ్డారు. నగల దుకాణ సిబ్బంది భయంతో పోలీసులకు కాల్ చేశారు. ఈ క్రమంలో అక్కడికి చేరుకున్న పోలీసులను చూసి దుండగులు పారిపోయారు. నిందితుల కోసం 10 బృందాలను ఏర్పాటు చేసి గాలించారు.





# జమ్మిగడ్డలో ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

ఏ ఎస్ రావు నగర్,తెలంగాణ ముచ్చట్లు:

ఉప్పల్ నియోజకవర్గం కాప్రా సర్కిల్ పరిధిలోని డాక్టర్ ఏ ఎస్ రావు నగర్ డివిజన్ జమ్మిగడ్డలో శ్రీ గోపికృష్ణ యాదవ్ సంఘం ఆధ్వర్యంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఆలయాన్ని విద్యుద్దీపాలతో, పూలతో అలంకరించగా, భక్తులు అధిక సంఖ్యలో హాజరై పూజలు, భజనలతో భక్తి శ్రద్ధలతో పాల్గొన్నారు.

వేడుకల్లో ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, స్థానిక కార్పొరేటర్ శిరీష సోమశేఖర్ రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సంప్రదాయ పండుగలు సమాజంలో ఐకమత్యాన్ని, భక్తి భావనను పెంపొందిస్తాయని, యువత ఈ విలువలను కాపాడుకోవాలని సూచించారు. ఆలయ నిర్వాహకులు అతిథులను శాలువాతో సన్మానించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు.

ఈ వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే ఎన్.వి.ఎస్.ఎస్. ప్రభాకర్, బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సోమశేఖర్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ పావని రెడ్డి, మాజీ కౌన్సిలర్ రాముల యాదవ్, ఎం.బి. కృష్ణ యాదవ్ తో పాటు గోపికృష్ణ యాదవ్ సంఘం వ్యవస్థాపకులు, సలహాదారులు, పదాధికారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. భక్తులకు అన్నప్రసాదం వితరణ చేయగా, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఆధ్యాత్మిక వాతావరణంలో వేడుకలను విజయవంతం చేశారు.

# ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

నాచారం,తెలంగాణ ముచ్చట్లు:

నాచారం నారాయణ పాఠశాలలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు శోభాయమానంగా నిర్వహించారు. విద్యార్థులు శ్రీకృష్ణుడు, రాధ, యశోద వేషధారణలో పాల్గొని ఆకట్టుకున్నారు. ప్రత్యేకంగా ఉట్టి పగులకొట్టే కార్యక్రమం సందడి రేపింది.

కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పాఠశాల జీఎం గోపాల్ రెడ్డి, ఎజీఎం బాల పరమేశ్వర రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇలాంటి వేడుకల ద్వారా విద్యార్థులకు సంస్కృతి, సాంప్రదాయాలు, పండుగల విశిష్టత గురించి అవగాహన కలుగుతుందని అన్నారు.

ఈ వేడుకల్లో పాఠశాల ప్రిన్సిపాల్ పర్వీన్, ఈచాంప్స్ కోఆర్డినేటర్ లక్ష్మీ భవాని, ఈకిడ్జ్ కోఆర్డినేటర్ నూర్, ఈచాంప్స్ వైస్ ప్రిన్సిపాల్ సరిత, ఈకిడ్జ్ వైస్ ప్రిన్సిపాల్ షాహీన్, ఏఓ మహేందర్, పీఈటీ నరేష్ తో పాటు ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.





# బీజేపీని ఓడించడమే సీపీఐ(ఎం) లక్ష్యం

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి జి ప్రభాకర్ రెడ్డి.

హసన్ పర్తి, తెలంగాణ ముచ్చట్లు:

దేశంలో బీజేపీ పార్టీని ఓడించడమే సీపీఐ(ఎం) లక్ష్యమని సీపీఐ(ఎం) హనుమకొండ జిల్లా కార్యదర్శి జి.ప్రభాకర్ రెడ్డి అన్నారు. శనివారం హసన్ పర్తి మండల కేంద్రంలో సీపీఐ(ఎం)మండల కమిటీ సభ్యుడు పుల్ల అశోక్ అధ్యక్షతన మండల కమిటీ సమావేశం నిర్వహించారు.ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా జిల్లా కార్యదర్శి జి.ప్రభాకర్ రెడ్డి పాల్గొన్నారు.ఈ సందర్భంగా జి.ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో రాబోయే కార్పొరేషన్, గ్రామపంచాయతీ ఎన్నికల్లో బీజేపీని ఓడించడమే మా ప్రధాన లక్ష్యమన్నారు.పార్టీ కేంద్రీకరించిన కొన్ని స్థానాల్లో సీపీఐ(ఎం) పార్టీ పోటీ చేస్తుందన్నారు. అలాగే బీజేపీని ఓడించడానికి మిత్రపక్షాలు ముందుకు వస్తే వారితో కలిసి పని చేయడానికి సిద్ధంగా ఉన్నామని బీజేపీ అన్ని వర్గాల ప్రజలకు అన్యాయం చేసిందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు హామీలను కూడా అమలు చేయడంలో విఫలమైందని పేర్కొన్నారు.మండల కమిటీ సభ్యులు ప్రజల్లో ఉండి ప్రజల సమస్యలను తెలుసుకొని పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు.

ఈ సమావేశంలో హసన్ పర్తి మండల కార్యదర్శి గుమ్మడిరాజుల రాములు,జిల్లా కమిటీ సభ్యురాలు వేలు రజిత,మండల కమిటీ సభ్యులు మంద సుచందర్, వేలు సుమన్, జి. సతీష్,ఎన్.మౌనిక తదితరులు పాల్గొన్నారు.




# తెలంగాణ ప్రభుత్వమే ఉద్యమకారులను ఆదుకోవాలి

- టియుపిఎస్ సమన్వయ కర్త చిలువేరు రమేష్

హసన్ పర్తి, తెలంగాణ ముచ్చట్లు:

తెలంగాణ ఉద్యమ కారులను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని టియుపిఎస్ సమన్వయ కర్త చిలువేరు రమేష్ అన్నారు. శనివారం రోజు హసన్ పర్తి మండల కేంద్రంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమకారులు అంటే ప్రభుత్వానికి చిన్న చూపు ఉందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మేనిఫెస్టోలో ఉద్యమకారుల అంశాన్ని చేర్చారు కాబట్టి తెలంగాణ ఉద్యమకారులను గుర్తించడానికి ఎప్పుడు కమిటీ వేస్తారో చెప్పాలని అన్నారు. ఉద్యమకారులు రోజు రోజుకు క్షీణించి పోతున్నారని రెక్కాడితే గానీ డొక్కా నిండని స్థితిలో ఉద్యమకారులు ఉన్నారని తెలియ చేయడానికే ఖమ్మంలో శాంతియుత రిలే నిరహార దీక్షలకు పోలీసుల నుండి అనుమతులు తీసుకొని దీక్ష చేయడం కోసం కదిలి వచ్చిన ఉద్యమకారులను అక్రమంగా అరెస్టులు చెయ్యడం బాధాకరమని అక్రమ అరెస్టులతో తెలంగాణ ఉద్యమకారుల ఉద్యమాన్ని ఆపలేరని జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల తేదీ వరకు మా హక్కులకోసం ప్రకటన రానియెడల జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో 100 మంది ఉద్యమకారులం నామినేషన్ వేస్తామని హెచ్చరించారు.ఉద్యమకారుల బాధలను ఆచరణలోకి తీసుకొని సత్వరమే న్యాయం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో భాషబోయిన రవీందర్ యాదవ్,జ్ఞానేశ్వర్, పబ్బు రాజేందర్,ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

# ఢిల్లీ వర్సిటీలో సీటు సాధించిన వంశీకి ఆర్థిక ఇబ్బందులు

- ఢిల్లీ వర్సిటీలో బీఏ ఆనర్స్ పొలిటికల్ సైన్స్ సీటు సాధించిన వంశీ
- ఫీజు, హాస్టల్ ఖర్చులు లక్షకు పైగా ఉండటంతో ఇబ్బంది
- భర్తకు మతిస్థిమితం లేకపోవడంతో ఇంటి పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్న తల్లి
- కొడుకు చదువు కొనసాగించేందుకు దాతల సహాయం కోరుతున్న భూక్య మాజి

పాలకుర్తి,తెలంగాణ ముచ్చట్లు:



జనగామ జిల్లా పాలకుర్తి మండలం కొండాపురం పెద్దతండాకు చెందిన భూక్య మాజి తన కొడుకు చదువుల కోసం తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తోంది. కుటుంబ పరిస్థితులు దయనీయంగా ఉండటంతో, ఢిల్లీ వర్సిటీలో సీటు సాధించిన తన కొడుకు వంశీకి ఫీజులు చెల్లించలేక ఇబ్బంది పడుతోంది.

ఇద్దరు కూతుర్లను డిగ్రీ వరకు చదివించి పెళ్లి చేసిన మాజి, తన చిన్న కుమారుడైన వంశీని ఇంటర్ వరకు చదివించింది. వంశీ ఇటీవల ఆలిండియా ప్రవేశ పరీక్ష రాసి ఢిల్లీ యూనివర్సిటీలో బీఏ ఆనర్స్ పొలిటికల్ సైన్స్ కోర్సులో ప్రవేశం పొందాడు. అయితే అడ్మిషన్, హాస్టల్ ఫీజులు లక్ష రూపాయలకు పైగా ఉండటంతో వాటిని చెల్లించలేని పరిస్థితి ఏర్పడింది.

20 ఏళ్లుగా భర్తకు మతిస్థిమితం లేకపోవడంతో ఇంటి పనులు, హోటల్ పనులు చేస్తూ కుటుంబాన్ని నెట్టుకొస్తున్న మాజి ఇప్పుడు తన కొడుకు ఉన్నత విద్య కోసం సహాయం చేయాలని దాతల్ని కోరుతోంది. తన కుమారుడు చదువు కొనసాగించేందుకు సహకరించాలంటూ 7674852691 (భూక్య కళ్యాణి) నంబరుకు ఫోన్ పే ద్వారా ఆర్థిక సాయం అందించాలని వేడుకుంటోంది.

తెలంగాణ ముచ్చట్లు

TELANGANA MUCHATLU

ఎడిటర్ : బొల్లెపాక రాజేష్

తెలుగు దిన పత్రిక

# షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

**కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే**

**చర్లపల్లి,తెలంగాణ ముచ్చట్లు:**

ఉప్పల్ నియోజకవర్గం చర్లపల్లి డివిజన్ సాయికృష్ణ ఎంక్లేవ్‌లో షార్ట్ సర్క్యూట్ కారణంగా ఓ ఇల్లు దగ్ధమైంది. ఈ ఘటనలో నష్టపోయిన కుటుంబాన్ని పరామర్శించడానికి ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి శంకర్ గౌడ్ ఇంటికి వెళ్లారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ షార్ట్ సర్క్యూట్ జరగడం బాధాకరమని, ప్రభుత్వం నుంచి లభించే సహాయం అందేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు నేమూరి మహేష్ గౌడ్, సప్పిడి శ్రీనివాస్ రెడ్డి, రాఘవ రెడ్డి, శ్రీనివాస్, శ్రీశైలం, ప్రసాద్ రెడ్డి, వెంకట్, శంకర్ నాయక్, వేణు స్వామి, ఎల్లయ్య, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.



# పేకాట రాయుళ్ళను అరెస్ట్ చేసిన ధర్మసాగర్ పోలీసులు

**ధర్మసాగర్,తెలంగాణ ముచ్చట్లు:**

ధర్మసాగర్ మండలంలోని మలక్‌పల్లి గ్రామ శివారులో పేకాట ఆడుతున్న వారిపై పోలీసులు దాడి చేసి ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. నమ్మదగిన సమాచారం ఆధారంగా పోలీసులు శనివారం నిర్వహించిన రైడ్‌లో ఎనిమిది మంది పేకాట ఆడుతుండగా, వారిలో ముగ్గురు పారిపోయారు.పోలీసులు పట్టుబడిన వారి వద్ద నుంచి 104 ప్లేయింగ్ కార్డులు, ₹11,170 నగదు, నాలుగు బైకులు, నాలుగు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడినవారు మలక్‌పల్లి గ్రామానికి చెందిన మానుపాటి వెంకన్న, మానుపాటి సంపత్, మానుపాటి రాజశేఖర్, కొలిపాక నాగరాజు, మడ్డి మధు. పారిపోయినవారిలో అయినవోలు మండలం కనపర్తి గ్రామానికి చెందిన నాతి చందు, ఇలా సారపు హరి ప్రసాద్, మలక్‌పల్లి గ్రామానికి చెందిన మానుపాటి హరి ఉన్నారు. ఈ దాడిలో ఎస్ఐ జానీ పాషా, ఎస్సై నరసింహారావు సిబ్బందితో కలిసి పాల్గొన్నారు. పట్టుబడిన వారిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.



# కీసర నూతన సీఐను కలిసిన మాజీ కోఆప్షన్ సభ్యుడు ఆడం షఫీక్

**కీసర,తెలంగాణ ముచ్చట్లు:**

కీసర పోలీస్ స్టేషన్‌కు నూతన సీఐగా బాధ్యతలు స్వీకరించిన ఆంజనేయులను మాజీ కోఆప్షన్ సభ్యుడు ఆడం షఫీక్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనతో పాటు నాగారం మున్సిపాలిటీ నాయకులు కూడా హాజరయ్యారు.ఇక్కడ పనిచేసిన సీఐ శ్రీనివాస్ బదిలీపై వెళ్లగా, కొత్తగా బాధ్యతలు చేపట్టిన ఆంజనేయులను ఆడం షఫీక్ శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేస్తూ శుభాకాంక్షలు తెలిపారు.




# అహ్మద్ గూడ డబుల్ బెడ్ రూమ్‌లో మౌలిక సదుపాయాల కోసం నిరాహార దీక్షలు

**కీసర, తెలంగాణ ముచ్చట్లు:**

అహ్మద్ గూడ డబుల్ బెడ్ రూమ్ కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించాలని, ప్రజా సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ప్రజా సంఘాల నాయకులు ఈనెల 18వ తేదీ సోమవారం నుండి రిలే నిరాహార దీక్షలు చేపట్టనున్నట్లు తెలిపారు.

డబుల్ బెడ్ రూమ్ ఫేస్ వన్ కమిటీ అధ్యక్షుడు వి. విజయ్ కుమార్ మాట్లాడుతూ, పేదలకు ఇళ్లు కేటాయించినప్పటికీ, తాగునీరు, విద్యుత్, రవాణా వంటి ప్రాథమిక సదుపాయాలు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని విమర్శించారు. ఫిర్యాదులు చేసినా అధికారులు స్పందించకుండా కాలయాపన చేస్తున్నారని, పైగా ఎంక్వయిరీల పేరుతో లబ్ధిదారులను బెదిరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

అధికారులు తక్షణమే అన్ని బ్లాక్‌లకు జనరేటర్లు ఏర్పాటు చేయాలని, భవనాల్లో ఏర్పడిన పగుళ్లు, లీకేజీలను మరమ్మతు చేయాలని, ప్యానల్ బోర్డులకు గ్రిల్లులు అమర్చాలని, ఎస్టీపీలు నిరంతరం పనిచేసేలా చూడాలని ఆయన డిమాండ్ చేశారు. అదేవిధంగా సికింద్రాబాద్ వరకు బస్సు సర్వీసులు పెంచాలని, అర్బన్ హెల్త్ సెంటర్, అంగన్వాడి సెంటర్, రేషన్ షాప్, ప్రాథమిక పాఠశాల ఏర్పాటు చేయాలని కోరారు. ప్రజల భద్రత కోసం విస్తృతంగా సీసీ కెమెరాలు అమర్చాలని, ప్రధాన సమస్యల పరిష్కారం వరకు నిరాహార దీక్షలు కొనసాగుతాయని కమిటీ అధ్యక్షుడు వి. విజయ్ కుమార్, కార్యదర్శి షేక్ లతో పాటు సభ్యులు స్పష్టం చేశారు.





# శ్రీ కృష్ణ జన్మాష్టమి సందర్భంగా క్విజ్,వేషధారణ పోటీలు

**సత్తుపల్లి, తెలంగాణ ముచ్చట్లు:**

శ్రీ కృష్ణ జన్మాష్టమి పర్వదిన సందర్భంగా స్థానిక జవహర్ నగర్ లోని రుక్మిణీ సత్య భామా సమేత కృష్ణాలయంలో శనివారం విద్యార్థులకు క్విజ్, శ్రీకృష్ణ వేషధారణ పోటీలు నిర్వహించారు. శ్రీ కృష్ణుని జీవిత చరిత్రపై జరిగిన క్విజ్ లో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను టాలెంట్ స్కూల్, విశ్వశాంతి విద్యాలయం, జిల్లా పరిషత్ ఎన్టీఆర్ నగర్ ఉన్నత పాఠశాల గెలుచుకున్నారు. శ్రీ కృష్ణ వేషధారణలో చిన్నారులు విలాసకవి నిహిర, జి.జోవిత, బి.భవిష్య ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను అందచేశారు.

విజేతలకు సత్తుపల్లి శాసన సభ్యురాలు మట్టా రాగమయి దయానంద్ బహుమతులు అందచేశారు. విశ్వశాంతి విద్యాలయం విద్యార్థుల కోలాట ప్రదర్శన ఆహూతులను అలరించింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నిర్వాహకులను అభినందించి సత్కరించారు. కార్యక్రమంలో సత్తుపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ దోమ ఆనంద్ బాబు, చల్లగుళ్ళ నరసింహారావు, తోట సుజలరాణి, ఆలయ కమిటీ నిర్వాహకులు పాల్గొన్నారు.







# నాగారంలో చిడంబ్ తైక్వాండో ఇన్‌స్టిట్యూట్ ప్రారంభం

**నాగారం, తెలంగాణ ముచ్చట్లు:**

తైక్వాండో శిక్షణ ఆత్మరక్షణకు ఎంతగానో ఉపయోగపడుతుందని నాగారం మున్సిపాలిటీ బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు గూడూరు ఆంజనేయులు తెలిపారు. నాగారం పురపాలక సంఘం 7వ వార్డులో విజయ్ హాస్పిటల్ ఎదురుగా కొత్తగా ఏర్పాటు చేసిన చిడంబ్ తైక్వాండో అకాడమీ ఇన్‌స్టిట్యూట్‌ను ఆయన శుక్రవారం ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్షల్ ఆర్ట్స్ నేర్చుకుంటే మహిళలు కూడా అనుకోని దాడుల నుంచి రక్షించుకోవచ్చని అన్నారు. కరాటే వలె తైక్వాండో గొప్ప క్రీడ అని, ఇందులో శాస్త్రీయ పద్ధతులు ఉన్నాయని పేర్కొన్నారు. మార్షల్ ఆర్ట్స్ శిక్షణ వల్ల రోగనిరోధక శక్తి పెరిగి ఆరోగ్యం మెరుగుపడుతుందని తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు ఈ విధమైన శిక్షణ ఇవ్వాలని సూచించారు. చిడంబ్ తైక్వాండో అకాడమీ యాజమాన్యం సమర్థవంతంగా శిక్షణ తరగతులు నిర్వహించి పిల్లలకు నాణ్యమైన శిక్షణ అందించాలని ఆయన కోరారు. అనంతరం గూడూరు ఆంజనేయులను శాలువాతో సన్మానించి మెమెంటో అందజేశారు.ఈ కార్యక్రమంలో గ్రాండ్ మాస్టర్ ఎ. ప్రవీణ్ కుమార్, మాస్టర్ ఎ. కిషోర్ కుమార్, అకాడమీ యాజమాన్యం, ఇతరులు పాల్గొన్నారు.

# అఖిలపక్ష ఐక్యవేదిక అధ్యక్షుడు సతీష్ యాదవ్ కు డాక్టరేట్ ప్రధానం

- **సమాజ సేవ, ప్రజా సమస్యలపై నిరంతర పోరాటానికి గుర్తింపు**
- **గౌరవ డాక్టరేట్ కు దోహదపడిన వనపర్తి ప్రజలకు రుణపడి ఉంటా**
- **అఖిలపక్ష ఐక్యవేదిక అధ్యక్షుడు డాక్టర్ సతీష్ యాదవ్**

**వనపర్తి,తెలంగాణ ముచ్చట్లు:**

18 ఏళ్లుగా ప్రజా సమస్యలపై నిరంతరంగా పోరాడుతూ.. సామాజిక సేవలో విశేషంగా సేవలందించిన వనపర్తి మాజీ కౌన్సిలర్ అఖిలపక్ష ఐక్యవేదిక అధ్యక్షుడు సతీష్‌యాదవ్‌కు గౌరవ డాక్టరేట్ ప్రధానం చేశారు. శనివారం పాండిచ్చేరి రాష్ట్రంలో గ్లోబల్ అక్రిడేషన్ కౌన్సిల్, పాండి యూనివర్సిటీ ఆధ్వర్యంలో సంయుక్తంగా జరిగిన ఈ ప్రతిష్టాత్మక కార్యక్రమంలో యునైటెడ్ నేషన్ ఐపియూజే యూనివర్సిటీ ప్రతినిధులు గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. దేశవ్యాప్తంగా వివిధ రంగాల్లో విశిష్ట సేవలు అందించిన పలువురికి ప్రముఖులకు ఈ గౌరవ డాక్టరేట్లను ప్రదానం చేయగా తెలంగాణ రాష్ట్రం నుంచి సామాజిక సేవ, ప్రజల శ్రేయస్సు విభాగంలో సతీష్ యాదవును ఎంపిక చేశారు.




గౌరవ డాక్టరేట్ అందుకున్న సందర్భంగా సతీష్ యాదవ్ మాట్లాడుతూ.. ప్రజా సమస్యలపై నేను చేస్తున్న సేవా కార్యక్రమాలను గమనించి ,నా సేవలకు గుర్తింపుగా గౌరవ డాక్టరేట్ ఇవ్వడం గర్వంగా ఉందని, కృష్ణాష్టమి రోజున అందుకోవడం నా అదృష్టం అని అలాగే ఇది నాకు మరింత బాధ్యతను పెంచిందని సతీష్ యాదవ్ తెలిపారు. నాకు లభించిన గౌరవానికి దోహదపడిన వనపర్తి పట్టణ జిల్లా ప్రజానీకానికి ఎల్లప్పుడూ రుణపడి ఉంటానని ఇది రాబోవు కాలంలో వనపర్తి జిల్లా ప్రజలకు మరింత సేవ చేయడానికి ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్లు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# నాగారం సెరినిటీ పాఠశాలలో ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

**నాగారం, తెలంగాణ ముచ్చట్లు:**

నాగారం మున్సిపల్ పరిధిలోని సెరినిటీ పాఠశాలలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించారు. జి.ఆర్.ఎస్.ఎస్. కార్యాలయ సముదాయంలో జరిగిన ఈ వేడుకల్లో చిన్నారులు గోపికలుగా, చిన్న కృష్ణుడిగా వేషధారణలో ఆకట్టుకొని కనువిందు చేశారు.

ఈ సందర్భంగా ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ మాట్లాడుతూ, శ్రీ మహావిష్ణువు ఎనిమిదవ అవతారమైన శ్రీకృష్ణుడి జన్మదినం హిందువుల అత్యంత పవిత్ర పండుగలలో ఒకటని పేర్కొన్నారు. పిల్లల వేషధారణను అభినందిస్తూ, మన సంస్కృతి సంప్రదాయాలను కాపాడుకుంటూ నైతిక విలువలతో ఎదగాలని కోరారు. పౌరాణిక సాంప్రదాయాలు నేటి సమాజానికి ఆదర్శప్రాయమని సూచించారు. నాగారం పట్టణంలోని భవానీ రామలింగేశ్వర ఆలయం నుండి బాలబాలికలతో శోభాయాత్రను కోలాటలతో కూడి ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు కఠిన భద్రతా ఏర్పాట్లు చేశారు. అనంతరం చిన్నారులకు బహుమతులు అందజేశారు. ఈ వేడుకల్లో మేడ్చల్ ఎమ్మెల్యే అభ్యర్థి, మాజీ ఎంపీపీ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఏనుగు సుదర్శన్ రెడ్డి, కీసర సీఐ అర్వపల్లి ఆంజనేయులు, ఎస్ఐ శ్రీనివాస్, మాదిరెడ్డి ప్రతాప్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు గణపురం కొండల్ రెడ్డి, మాజీ వార్డు సభ్యులు సాయినాథ్ గౌడ్, జర్నలిస్టు బిక్షపతి, సెరినిటీ పాఠశాల కరస్పాండెంట్ నోముల జంగిరెడ్డి, అంబడి బాలగోకులం కమిటీ సభ్యులు, జేఏసీ అధ్యక్షుడు జయకుమార్‌తో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.





# జయగిరి గ్రామంలో జియో నెట్‌వర్క్ విఫలం

- **వినియోగదారులు అవస్థలు**

**హసన్ పర్తి, తెలంగాణ ముచ్చట్లు:**

హనుమకొండ జిల్లా హసన్ పర్తి మండలం జయగిరి గ్రామంలో జియో మొబైల్ నెట్‌వర్క్ పూర్తిగా పని చేయకపోవడంతో స్థానిక వినియోగదారులు తీవ్ర అసౌకర్యం ఎదుర్కొన్నారు. శనివారం ఉదయం నుండి నెట్‌వర్క్ అంతరాయముతో మొబైల్ కాల్స్, ఇంటర్నెట్ సేవలు, వాయిస్ కాల్స్, అలాగే జియో ఫైబర్ సేవలు కూడా నిలిచిపోయాయి.

ఈ అసౌకర్యం కారణంగా విద్యార్థులు, ఉద్యోగులు, మరియు వ్యాపారవేత్తలు తమ పనుల్లో అంతరాయం ఎదుర్కొన్నారు. హెల్త్, బ్యాంకింగ్, మరియు ఆన్లైన్ సేవలు డిస్టర్బ్ అయ్యాయి. గ్రామస్తులు ఈ విషయంపై జియో అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ, ఇప్పటివరకు ఎలాంటి స్పందన లేదని పేర్కొన్నారు.గ్రామ ప్రజలు త్వరితగతిన సమస్య పరిష్కరించి మళ్లీ సేవలు పునరుద్ధరించాలని జియో నిర్వాహకులను కోరుతున్నారు.



తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



# సెప్టెంబర్ 9న చలో హైదరాబాద్

- వికలాంగులు మరియు చేయూత పెన్షన్ దారులు మహా గర్జన జయప్రదం చేయండి
- మకాం శ్రీనివాసులు
- వి హెచ్ పి ఎస్ వనపర్తి జిల్లా అధ్యక్షులు, కొమ్ము చెన్నకేశవులు



**వనపర్తి, తెలంగాణ ముచ్చట్లు:**

వికలాంగుల, వృద్ధులు, వితంతువుల, ఒంటరి మహిళల చేయూత, పెన్షన్ దార్ల సమావేశం వనపర్తి కేంద్రంలో పాలిటెక్నిక్ కళాశాల లో సమావేశం ఏర్పాటు చేసుకొని మాట్లాడుతూ .. వికలాంగుల, వృద్ధులు, వితంతువుల, చేయూత, పెన్షన్ దార్ల ఇతర పెన్షన్ దారుల మహా గర్జన హైదరాబాద్ ముఖ్య అతిథిగా పద్మశ్రీ మంద కృష్ణమాదిగ, ఎమ్మార్పీఎస్, విఎస్పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు
హాజరవుతున్నారు. కావున వికలాంగులు మరియు చేయూత పెన్షన్ దారుల మహా గర్జన.పరేడ్ గ్రౌండ్ గతంలో పరేడ్ గ్రౌండ్ లోనే జరిగిన ధర్మ యుద్ధాన్ని, విశ్వరూపాన్ని తలపించేలా వికలాంగులు మరియు చేయూత పెన్షన్ దారుల మహాగర్జన నిర్వహిద్దాం. 50 లక్షల పేద కుటుంబాలకి చెందిన పెన్షన్ దారుల సమస్యలను పాలక ప్రతిపక్షాలు విస్మరించిన ఈ సమయంలో మనం నిర్వహించబోయే ఈ గర్జనను అత్యంత సవాలుగా తీసుకుందాం.అందుకే ఈనెల 17న రంగారెడ్డి జిల్లా బాలాపూర్ లో అత్యవసర ఎమ్మార్పీఎస్, వీహెచ్పీఎస్ తో పాటు అన్ని అనుబంధ సంఘాల తెలంగాణ రాష్ట్ర కార్యవర్గ సమావేశం.పద్మ శ్రీ మంద కృష్ణ మాదిగ గారు జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.వికలాంగుల పెన్షన్ 6000 కు పెంచాలి, వృద్ధులు, వితంతువుల, ఒంటరి మహిళలు, ఇతర పెన్షన్లను, 4000 పెంచాలని డిమాండ్
సీఎం రేవంత్ రెడ్డి వికలాంగులకు, వృద్ధులకు ,వితంతువులకు, చేయూత పెన్షన్దారులకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో వికలాంగులకు, వృద్ధులకు, వితంతువులకు, ఒంటరి మహిళలకు, చేయూత, పెన్షన్ దారులకు ఇతర పెన్షన్ దారులకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలి తెలిపారు. ఈ కార్యక్రమంలో గంధం గట్టయ్య మాదిగ గంధం లక్ష్మయ్య మాదిగ వి హెచ్ పి ఎస్ రాష్ట్ర నాయకులు గంధం కృష్ణయ్య, వి హెచ్ పి ఎస్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పి శ్రీనివాసులు, వి హెచ్ పి ఎస్ జిల్లా ఉపాధ్యక్షులు,కుశ కుమార్ వి హెచ్ పి ఎస్ వనపర్తి పట్టణ అధ్యక్షులు,కృష్ణవేణి వి హెచ్ పి ఎస్ మహిళ జిల్లా అధ్యక్షురాలు,మచ్చ తిరుపతి ,మొలకలపల్లి పరుషరాముడు,ఎం ఎస్ ఎఫ్ నాయకులు దేవని రమేష్,శాంతి కుమార్ , వెంకట్ రాములు,రేవల్లి శ్రీను,వంగాలి నాగరాజు,బాలరాజు ,వడ్డెమన్ రవి తదితరులు పాల్గొన్నారు.

# నిరుపేదల ఆరోగ్యానికి అండగా నిలుస్తున్న ఎమ్మెల్యే మేఘారెడ్డి

**వనపర్తి,తెలంగాణ ముచ్చట్లు:**



వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి, నియోజకవర్గ పరిధిలోని నిరుపేదల ఆరోగ్యానికి అండగా నిలుస్తున్నారు. ఆర్థిక స్తోమత లేక తాము మెరుగైన వైద్యం చేయించుకోలేక పోతున్నామని, తనను ఆశ్రయించిన ప్రతి ఒక్కరికి ప్రభుత్వం తరపున వారి చికిత్సకు సరిపోయేంత ఎల్ఓసి లను మంజూరు చేయించి తన మానవత్వాన్ని చాటుకుంటున్నారు వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి. జూలై నెల 30 రోజుల్లో రోజుకో ఎల్ఓసి చొప్పున, 29 ఎల్ఓసి లను మంజూరు చేయించారు. అదేవిధంగా జులై నెలలో రూ.68 లక్షల 80 వేల విలువగల, 239 సీఎంఆర్ఎఫ్ చెక్కులను సైతం ఎమ్మెల్యే మంజూరు చేయించారు. ఈ సందర్భంగా ఆయన రేవల్లి మండలం నాగపూర్ గ్రామానికి చెందిన కల్వకోలు సత్యం కు మెరుగైన వైద్యం చేయించుకునేందుకు, రూ. 5లక్షలు, ప్రస్తుతం మరో రూ.3 లక్షలు మొత్తం రూ. 8 లక్షల విలువగల ఎల్ఓసి నీ ఎమ్మెల్యే బాధిత కుటుంబానికి అందజేశారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే కి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. పార్టీల కతీతంగా తన, మన బేధం లేకుండా ఆపదలో ఉన్నానంటే, ఆయన ఆలోచించకుండా అపన్న హస్తము అందిస్తూ వస్తున్నారు. ఈ విధంగా ఒక్కో నెలలో రోజుకు ఒకటి, రెండు ఎల్ఓసి లను 300 నుంచి 400 సీఎంఆర్ఎఫ్ చెక్కులను మంజూరు చేయిస్తూ నిరుపేదల ఆరోగ్యాభివృద్ధికి వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి ఎంతో తోడ్పాటును అందిస్తున్నారని నియోజకవర్గ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# పెన్షన్ల పెంపు సాధించేవరకు ఎమ్మార్పీఎస్ పోరాటం

- ఎమ్మార్పీఎస్ నాయకులు బొట్ల మహేష్,గుర్రం నవీన్ మాదిగ

**స్టేషన్ ఘనపూర్,తెలంగాణ ముచ్చట్లు:**



స్టేషన్ఘనపూర్ మండలం చాగల్లు గ్రామంలో వికలాంగులు, చేయూత పెన్షనుదారుల సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన మండల అధ్యక్షుడు గుర్రం నవీన్ మాదిగతో పాటు ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మార్పీఎస్ స్టేషన్ఘనపూర్ మండల ఇన్‌ఛార్జి బొట్ల మహేష్ మాదిగ మాట్లాడుతూ, రేవంత్ రెడ్డి ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు.
వికలాంగుల పెన్షన్‌ను నాలుగు వేల నుంచి ఆరు వేలకి, వృద్ధులు, వితంతువుల చేయూత పెన్షన్‌ను రెండు వేల పదహారు నుంచి నాలుగు వేల వరకు, కండరాల క్షీణతతో బాధపడేవారికి, ఇతర తీవ్రమైన రోగులకు ఆంధ్రప్రదేశ్‌లో లాగా పదిహేనువేల రూపాయల వరకు పెంచాలని కోరారు. డిసెంబర్‌లో పెంచుతామని చెప్పినా ఇప్పటికీ అమలు చేయకుండా, పెన్షన్ డబ్బులను వేరే దారిలో వినియోగించడం ద్రోహమని ఆయన మండిపడ్డారు. నెలకు వెయ్యి కోట్ల రూపాయల చొప్పున 20 నెలలుగా సుమారు ఇరవై వేల కోట్ల రూపాయలను లబ్ధిదారులపై ఖర్చు చేయకపోవడం ఘోర అన్యాయం అని విమర్శించారు. పెన్షన్ మీదే ఆధారపడి బతికే ప్రజల బాధలను ప్రభుత్వం గాలికొదిలేస్తోందని ప్రశ్నించారు.
ఎమ్మార్పీఎస్ పోరాటం ద్వారానే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో వృద్ధులు, వితంతువులు, వికలాంగులకు పెన్షన్లు 200 రూపాయల నుంచి దశలవారీగా 1000, 1500, 2000 వరకు పెంచడం సాధ్యమైందని గుర్తుచేశారు. ఆ స్ఫూర్తితోనే ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుతం 6000 రూపాయలు సాధించామని, అదే విధంగా తెలంగాణలో కూడా పెన్షన్లు ఆరు వేల వరకు పెంచేవరకు తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.
మాజీ మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి నాయకుడు పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఈ నెల 28న పెన్షనుదారుల పక్షాన గొంతుకగా హాజరవుతారని తెలిపారు. సెప్టెంబర్ 9లోపు పెన్షన్ పెంపు అమలు చేయకపోతే లక్షలాది మందితో "చలో హైదరాబాద్ - పెన్షనుదారుల గర్జన" నిర్వహిస్తామని హెచ్చరించారు.
ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు చాడ ఏలియా మాదిగ, జిల్లా నాయకుడు నలిమేల నాగరాజు మాదిగ, మండల అధ్యక్షుడు గాదే శ్రీధర్ మాదిగ, మండల నాయకులు బాలస్వామి మాదిగ, రాజబాబు మాదిగతో పాటు వృద్ధులు, వికలాంగులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# మేడారంలో పంట నష్టాలపై బడే నాగజ్యోతి విమర్శలు

-భారీ వర్షా లతో జంపన్న వాగు పొంగిపొర్లి పంట పొలాలు ముంపు
-రైతులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని డిమాండ్
-కోట్ల నిధులు తెచ్చామని చెప్పకుంటూ అభివృద్ధి శూన్యం అని ఆరోపణ
-మంత్రి సీతక్కపై మేడారం ప్రజలకు వాగ్దానాలు నిలబెట్టలేదని ఎద్దేవా

**ములుగు, తెలంగాణ ముచ్చట్లు:**



భారీ వర్షాల కారణంగా మేడారం పరిసర ప్రాంతాల్లో పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయని బిఆర్ఎస్ ములుగు నియోజకవర్గ ఇంచార్జి బడే నాగజ్యోతి ఆరోపించారు.
శనివారం తాడ్వాయి మండలంలోని మేడారం గ్రామంలో రైతులతో కలిసి నష్టపోయిన పంట పొలాలను పరిశీలించిన ఆమె, జంపన్న వాగు పొంగిపొర్లడంతో చుట్టుపక్కల పంట పొలాలు ముంపునకు గురయ్యాయని తెలిపారు. పంటల నష్టంతో రైతులు ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయారని, ప్రభుత్వం వెంటనే పరిహారం అందించాల్సిన అవసరం ఉందని డిమాండ్ చేశారు.
జంపన్న వాగుకు కరకట్ట ఎత్తు పెంచి పంట పొలాలు, సమ్మక్క-సారలమ్మ గద్దెలు రక్షించే చర్యలు తీసుకోవాలని సూచించారు. కోట్ల రూపాయల నిధులు తెచ్చామని చెప్పుకుంటూ మేడారంలో అభివృద్ధి ఏమాత్రం జరగలేదని ఆమె విమర్శించారు.ప్రజల ఓట్లతో గెలిచిన మంత్రి సీతక్క మేడారం అభివృద్ధికి ఎలాంటి కృషి చేయలేదని, ఇప్పటి వరకు ఏం సాధించారో ప్రజలకు చెప్పాల్సిన సమయం వచ్చిందని బడే నాగజ్యోతి ఎద్దేవా చేశారు.
ఈ కార్యక్రమంలో తాడ్వాయి మండల అధ్యక్షులు దండుగుల మల్లయ్య, జిల్లా నాయకులు ఎట్టి జగదీష్, మాజీ జడ్పీటీసీ శ్రీనివాస్ రెడ్డి, మాజీ సర్పంచ్ చిడం బాబురావు, మండల యువజన అధ్యక్షులు కోట సురేష్, గ్రామ కమిటీ అధ్యక్షులు గజ్జెల సమ్మయ్య, సీనియర్ నాయకులు ఎండీ రఫిక్, సిద్దబోయిన నర్సింగరావు, ఇర్ప విజయ, మాదరి కేశవరావు, వాల్లేపు సారయ్య, గుర్రాల రాజిరెడ్డి, మెందు సమ్మిరెడ్డి, బేండల నర్సయ్య, మాజీ వార్డు సభ్యుడు ఇప్ప సతీష్, యువజన నాయకులు ఆలం అర్జున్, చిడం సాగర్ తదితరులు పాల్గొన్నారు.



# కుషాయిగూడలో ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు

**కుషాయిగూడ,తెలంగాణ ముచ్చట్లు:**

ఉప్పల్ నియోజకవర్గం, చర్లపల్లి డివిజన్, కుషాయిగూడలో శ్రీ మల్లన్న యాదవ సంఘం ఆధ్వర్యంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి.ఈ వేడుకలకు ముఖ్య అతిథులుగా కుషాయిగూడ ఏసీపీ వెంకట్ రెడ్డి, సీఐ భాస్కర్ రెడ్డి హాజరయ్యారు. సంఘం నాయకులు ప్రత్యేకంగా పూజా కార్యక్రమాలు నిర్వహించగా, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆటపాటలతో ఆనందోత్సవంగా వేడుకను జరుపుకున్నారు. యాదవ సంఘం నాయకులు సంప్రదాయ వైభవంతో వేడుకను విజయవంతంగా నిర్వహించారు.



# నేడు వడ్డేపల్లిలో బోనాలు

-ఏర్పాట్లను పర్యవేక్షించిన మాజీ చీఫ్ విప్ దాస్యం

**హనుమకొండ,తెలంగాణ ముచ్చట్లు:**

వడ్డేపల్లి పోచమ్మ తల్లి బోనాల పండుగను నేడు (ఆగస్టు 17న) అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు బీఆర్ఎస్ పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షులు, మాజీ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్ తెలిపారు.
ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి ఏడాది లాగే ఈ ఏడాది కూడా గ్రామ దేవతల దీవెనల కోసం ప్రత్యేక పూజలు నిర్వహించనున్నామని తెలిపారు. ప్రజలందరూ సుఖశాంతులతో సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షిస్తూ ఆనవాయితీగా బోనాల పండుగను కొనసాగిస్తున్నామని చెప్పారు.
పండుగ సందర్భంగా పలారాల బండి ఊరేగింపు, పోతురాజుల విన్యాసాలు, డప్పు చప్పుల మధ్య భక్తులు పోచమ్మ వారికి బోనాలను సమర్పించనున్నారని వివరించారు. కుల, మత, పార్టీ భేదాలు లేకుండా అందరూ కలిసి బోనాల పండుగలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.
పండుగ నిర్వహణకు సంబంధించిన అన్ని ఏర్పాట్లను ఇప్పటికే పరిశీలించినట్లు పేర్కొన్నారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.



# వెల్టూర్ లో ఘనంగా కృష్ణాష్టమి ఉట్ల పండగ

**వనపర్తి, తెలంగాణ ముచ్చట్లు:**

పెద్దమందడి మండలం వెల్టూర్ గ్రామంలో శ్రీ కృష్ణాష్టమి సందర్భంగా ఉట్ల కొట్టే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. శనివారం సాయంత్రం యాదవులు ఆధ్వర్యంలో చిన్నారులు, పెద్దలు, గ్రామస్తులు కలిసి ఉట్టి కి ప్రత్యేక పూజలు నిర్వహించి ఉట్లు కొట్టారు. ఉట్ల పండుగ సందర్భంగా.. ఉట్లు కొట్టిన వారిలో ట్రాక్టర్ మల్లయ్య, మధుగం కృష్ణయ్య ఉన్నారు. ఉట్లు కొట్టిన వారికి బహుమతులను అందజేశారు. ఉట్ల పండగ వేడుకల్లో గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఉత్సవాన్ని ఆసక్తికరంగా తిలకించారు. శ్రీకృష్ణ జన్మాష్టమి పురస్కరించుకొని ఉట్ల పండుగ ఉత్సవంలో గ్రామానికి చెందిన అన్నదాతలు బండారి నరసింహ, బత్తుల రాములు, బత్తుల నరసింహ, బత్తుల హనుమంతు, బత్తుల అంజి వారి ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువకులు, చిన్నారులు మహిళలు పాల్గొన్నారు.



# క్షత గాత్రులను ఆసుపత్రిలో పరామర్శించిన కాంగ్రెస్ నాయకులు రవి నాయక్

**వనపర్తి ,తెలంగాణ ముచ్చట్లు:**

ఘనపూర్ మండలం, మాల్కిమియన్ పల్లి గ్రామంలో, కరెంటు తీగలను సరి చేసే క్రమంలో, విద్యుత్ స్తంభం విరిగి ఆముదం బండ తండాకు చెందిన సిద్దు కింద పడిపోయి చెయ్యి మరియు కాలు మేడిమే భాగం విరిగి పోయి నవని తెలిసినా వెంబడే, హాస్పిటల్ కి వెల్లి, స్నేహ సన్ షైన్ హాస్పిటల్ డాక్టర్ లతో మాట్లాడిన ముడావత్ రవినాయక్ మరియు కుటుంబ సభ్యులకు ధైర్యాని కలిగించారు. అలాగే
అనారోగ్యంతో బాధపడుతూ శ్రీ బాలాజీ న్యూరో హాస్పిటల్ లో చికిత్స పొందుతున్న ఘనపూర్ మండలం, ముందర తండాకు చెందిన కేతవత్ గోపాల్ నాయక్ ను, పరామర్ధించి వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపిన జిల్లా దిశ కమిటీ మెంబర్ మూడవత్ రవి నాయక్. ఇరువురి కుటుంబ సభ్యులతో మాట్లాడిన రవి నాయక్, స్థానిక ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి తో, ఫోన్లో మాట్లాడడం జరిగింది. ఎమ్మెల్యే మేఘా రెడ్డి సానుకూల స్పందిస్తూ, ప్రభుత్వ పరంగా అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తానని ఇరువురి ఆరోగ్యం తొందరగా కోలుకోవాలని ఆకాంక్షించారని రవినాయక్ అన్నారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
తెలుగు దిన పత్రిక



## క్లాస్మేట్ కుటుంబానికి స్నేహితుల ఆర్థిక సహాయం

**జనగామ జిల్లా, తెలంగాణ ముచ్చట్లు:**

పాలకుర్తి మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో 1993-94 విద్యా సంవత్సరంలో 10వ తరగతి చదివిన క్లాస్మేట్ చిట్యాల సంపత్ అనారోగ్యంతో ఇటీవల మృతిచెందాడు. ఈ నేపథ్యంలో అతని కుటుంబానికి తోడుగా నిలుస్తూ సహపాఠులు కలిసి 40 వేల రూపాయల ఆర్థిక సహాయం అందజేశారు. శనివారం రోజు నిర్వహించిన కార్యక్రమంలో ఈ మొత్తాన్ని సంపత్ కుమారుడు చిట్యాల వికాస్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో డివిఆర్ శర్మ, వెంకటేశ్వరరావు, నాగరాజు, శ్రీను, లక్ష్మణ్, సొమ్మల్లు, పరమేశ్వర్, ప్రవీణ్, సోమేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

## ఆ రోజు వస్తుంది!

చెప్పేవాళ్లకు లేకపోతే
వినేవాళ్ళకైనా ఉండాలి!
ఏంటోమీకుతెలుసుగా!
సిగ్గులేకుండా నీతులు!
అన్నీకోతలు వట్టి రోతలు

ఇంతఘాటు విమర్శలు
ఎందుకుచేస్తున్నానంటే
మన నాయకులు చెప్పే
మాటలకూ చేతలకూ
ఏమాత్రం పొంతన లేదు!

ఇదిరాజకీయచదరంగం
ఈఆటలోజనంపావులు!
'మేకిన్ఇండియా'నీతులు
వీళ్ళదుస్తులువిదేశీయం
మిత్రబంధుగణంవిదేశల్లో

ఒక 'వావిలాల' ఏడీ?
ఖద్దరుకట్టి చేతిలోసంచి
అసెంబ్లీలో పెద్ద గొంతు!
సైకిల్ మీద వచ్చిన
సుందరయ్యలు ఎక్కడ?

భారతీయ సమాజం

ఇప్పటికీ ఇలాఉందంటే
కారణం సామాన్య జనం!
వాళ్ళింకాపడుకొండలనే
భక్తిభావంతోచూస్తున్నార్

'మను'భావాలువీడలేదు
ప్రజాస్వామ్యంఅంటలేదు
స్వేచ్ఛంటేతెలియ లేదు
బానిస భయం పోలేదు!
వివక్షలు తొలగి పోలేదు!

తమపెత్తందారీసాగటానికే
చదువుల్లేకుండా చేసారు
మూఢ నమ్మకాలను
అజ్ఞాన సమాజాన్ని
కావాలనే సృష్టించారు!

అసలు కారణం తెలిసి
ఆ చూపులే తిరగబడి
ఈ నీతి బాహ్యులపై
ప్రసరిస్తే -ఏమౌతుంది?
ఆరోజు రాదనుకోకండి!

**తమ్మినేని అక్కిరాజు**
హైదరాబాద్

# సికింద్రాబాద్‌లో తపస్వి ప్రజా గ్రంథాలయ ప్రారంభోత్సవం

**హైదరాబాద్,తెలంగాణ ముచ్చట్లు:**

సాహిత్య రంగంలో విశిష్ట స్థానాన్ని సంపాదించిన తపస్వి మనోహరం సంస్థ, ఇప్పటివరకు తెలుగులో తపస్వి మనోహరం వారపత్రిక, మనోహరి మహిళా మాసపత్రికలతో పాటు హిందీ, ఆంగ్లంలోనూ మాసపత్రికలను వెలువరించింది. అదేవిధంగా తపస్వి కలల కథలు అనే వినూత్న వేదికను ఆరంభించి, కథలు చెప్పే ప్రతిభావంతులను సమాజానికి పరిచయం చేస్తూ, కథా విన్యాసాలపై శిక్షణ అందిస్తోంది.
కార్తిక్ నిమ్మగడ్డ నేతృత్వంలోని ఈ సంస్థ, పత్రికా రంగంలో స్థిరమైన స్థానాన్ని ఏర్పరుచుకోవడమే కాకుండా పుస్తక ప్రచురణలోనూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంది. తక్కువ వ్యయంతో అందంగా ముద్రించిన వందలాది పుస్తకాల ద్వారా వర్ధమాన రచయితలకు కలలను సాకారం చేసింది.



ఇక సికింద్రాబాద్‌లో తపస్వి ప్రజా గ్రంథాలయం పేరుతో ఉచిత గ్రంథాలయాన్ని ఏర్పాటు చేశారు. ప్రముఖ కవయిత్రి, రచయిత్రి, కణిక సంస్థ వ్యవస్థాపక అధ్యక్షురాలు, ప్రేరణాత్మక వక్త రమాదేవి కులకర్ణి దీన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో తపస్వి సంస్థ డైరెక్టర్లు స్వప్న (బుజ్జమ్మ), మలవతు విజయతో పాటు ఇతర సభ్యులు పాల్గొన్నారు.
సాధనాకుటీరం అనే అందమైన ఆవరణలో ఏర్పాటు చేసిన ఈ గ్రంథాలయంలో పుస్తకాలు అందుబాటులో ఉంటాయి. కనెక్ట్ హబ్ స్థాపకుడు కిరణ్ రాథోడ్ సహకారంతో భవిష్యత్తులో సంగీతం, కళలు, ఇతర రంగాల్లో శిక్షణ శిబిరాలు, సాంస్కృతిక కార్యక్రమాలు కూడా నిర్వహించనున్నట్లు తెలిపారు.

## జాతీయస్థాయి విజయాన్ని సాధించాలని ప్రభుదేవ్‌కు ఘన సన్మానం

**ధర్మసాగర్,తెలంగాణ ముచ్చట్లు:**




హనుమకొండ జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో జూలై 27, 28 తేదీల్లో జరిగిన జిల్లా స్థాయి 600 మీటర్ల, 60 మీటర్ల పరుగు పందెల్లో ప్రభుదేవ్ ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకున్నాడు. అనంతరం ఈ నెల 4వ తేదీన జరిగిన సౌత్‌జోన్ తెలంగాణ రాష్ట్ర మీట్‌లో 1000 మీటర్ల రిలే పరుగు పందెలో రక్షణు, సందీప్, రోహిత్‌తో కలిసి ప్రభుదేవ్ తన జట్టుకు మొదటి స్థానం సాధించాడు.
ప్రభుదేవ్ ధర్మసాగర్ మండల కేంద్రానికి చెందిన ఎమ్మార్పీఎస్ ఉద్యమకారుడు గంగారపు శ్రీనివాస్ ప్రశాంత దంపతుల కుమారుడు. ప్రస్తుతం సెయింట్ గాబ్రియల్ స్కూల్‌లో పదవ తరగతి చదువుతున్న ఆయన చదువులోనూ, క్రీడల్లోనూ ప్రతిభ కనబరుస్తున్నాడు.
ఈ విజయాన్ని పురస్కరించుకుని ధర్మసాగర్ మండల కేంద్రంలోని గవర్నమెంట్ కళాశాల సమీపంలో వ్యాయామ ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు కలిసి ప్రభుదేవ్‌ను ఘనంగా సన్మానించారు. శాలువాతో సత్కరించిన వారు జాతీయస్థాయి పరుగు పందెలో కూడా ప్రథమ స్థానాన్ని సాధించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో నక్క హరిబాబు, పోలుమారి ప్రవులు, నక్క రాజు, కొట్టె భాను చందర్, మగ్రిపల్లి ప్రవీణ్ కుమార్, కొట్టె వేణు తదితరులు పాల్గొన్నారు.

# అలుపెరుగని పోరాట యోధుడు


భారత దేశంలో సర్దార్ లుగా పేరొందిన ప్రముఖులలో ఒకరు సర్దార్ వల్లభభాయి పటేల్. మరొకరు సర్దార్ గౌతు లచ్చన్న. ఒకరిది దేశస్థాయిలో, మరొకరిది రాష్ట్ర స్థాయిలో రాణించారు. సర్దార్ అంటే సేనాని. స్వాతంత్ర్యోద్యమ పోరాట వీరునిగా ఎన్నో ఉద్యమాలు నడిపిన కురువృద్ధుడు సర్దార్ గౌతు లచ్చన్న. జమీందారీ వర్గాల వ్యతిరేక పోరాట వీరునిగా ప్రజాహృదయాలలో లచ్చన్న స్థానం చెక్కు చెదరనిది. గౌతు లచ్చన్న (ఆగష్టు 16, 1909 ఏప్రిల్ 19, 2006) సాహసానికి, కార్యదక్షతకు మెచ్చి ప్రజలిచ్చిన కితాబే సర్దార్. సర్దార్ గౌతు లచ్చన్న, వి.వి.గిరి, నేతాజి సుభాష్ చంద్రబోస్, జయంతి ధర్మతేజ, మొదలగు అనేక మంది జాతీయ నాయకులతో కలిసి భారత దేశ స్వాతంత్ర్య పోరాటాలలో పాల్గొని, అనేక పర్యాయాలు జైలుకు వెళ్ళారు. ప్రకాశం పంతులు, బెజవాడ గోపాల రెడ్డి మంత్రివర్గంలో మంత్రి పదవి నిర్వహించిన లచ్చన్న, మద్యపాన నిషేధం విషయంలో ప్రకాశం పంతులుతో విభేదించి, అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టి, ప్రకాశం ప్రభుత్వ పతనానికి కారణభూతుడయ్యారు. చిన్న రాష్ట్రాల ఏర్పాటుకు మద్దతు ప్రకటించారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధనకు నాటి ఉద్యమ నేత మర్రి చెన్నారెడ్డితో చేతులు కలిపారు. తెలంగాణా రాష్ట్ర అవసరాన్ని, ఔచిత్యాన్ని వివరిస్తూ పుస్తకం వ్రాశాడు. ఇందిరాగాంధి అత్యవసర పరిస్థితి విధించినప్పుడు వ్యతిరేకించి, స్వేచ్ఛ కోసం పోరాడారు. చౌదరి చరణ్ సింగ్, జయప్రకాష్ నారాయణ, మసాని లతో కలిసి పనిచేశారు. తెలుగులో మంచి ఉపన్యాసకుడుగా, రాజాజి ఉపన్యాసాల అనువాదకుడిగా, చరిత్ర ముద్ర వేయించుకున్న బడుగువర్గ పోరాట యోధుడు లచ్చన్న. సర్దార్ గౌతు లచ్చన్న. ఉత్తర కోస్తా కళింగసీమలో ఉద్దానం ప్రాంతాన (నాటి గంజాం జిల్లా) సోంపేట తాలూకాలో బారువా అనే గ్రామంలో 1909 ఆగష్టు 16 వ తేదీన ఒక సాధారణ బీద గౌడ కుటుంబములో గౌతు చిట్టయ్య, రాజమ్మ దంపతులకు జన్మించారు. బారువాలో గల ప్రాథమిక పాఠశాలలో 1916లో చేరి, పాఠశాలలో 8 వ తరగతి వరకు చదివి, ప్రక్కనే ఉన్న మందసా రాజావారి హైస్కూల్లో 9 వ తరగతిలో చేరి, పరీక్ష తప్పాడు. శ్రీకాకుళంలో ఉన్నత పాఠశాలలో చేర్పించగా, అక్కడ జగన్నాధం పంతులుగారి ఇంటిలో ఉండి చదువు సాగించారు. ఆ స్కూల్లో డ్రిల్ మాష్టారు నేమాని నరసింహామూర్తి శిక్షణలో



జాతీయ భావాల్ని అలవర్చుకున్నారు. లచ్చన్నకు ఆనాటికి 21 సవంత్సరాలు. 192930 విద్యా సంవత్సరం మెట్రిక్యులేషన్ చదువుతుండగానే 21వ ఏట గాంధీజీ పిలుపువిని విద్యకు స్వస్తి చెప్పి స్వాతంత్ర్యోద్యమంలో దూకారు. 1930 లో మహాత్మాగాంధీ ఉప్పు సత్యాగ్రహానికి పిలుపినిచ్చారు. దీనికి ప్రభావితుడైన లచ్చన్న బారువా సమీపంలో ఉన్న సముద్రపు నీరుతో ఉప్పు తయారుచేసి ఆ డబ్బుతో ఆ ఉద్యమాన్ని నడిపారు. విదేశీ వస్తు బహిష్కరణోద్యమంలో పాల్గొని అందరూ చూస్తుండగానే తన విలువైన దుస్తులను అగ్నికి అహుతి చేశారు. ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొంటున్నప్పుడు లచ్చన్నను అరెస్టు చేసి టెక్కలి, నరసన్నపేట సబ్ జైళ్లల్లో నలభై రోజులు ఉంచారు. కోర్టు తీర్పు మేరకు మరో నెల రోజుల శిక్షను అతను బరంపురం జైల్లో అనుభవించవలసి వచ్చింది. 1932 వ సంవత్సరంలో శాసనోల్లంఘన ఉద్యమంలో పాల్గొంటున్న లచ్చన్నను రాజమండ్రి జైల్లో ఐదు మాసాలు ఉంచారు. అంటరానితనం నిర్మూలన. అంటరానితనం మీద కత్తి ఝళిపించాడు లచ్చన్న. అతను నడిపిన హరిజన సేవా సంఘాలు, చేపట్టిన హరిజన రక్షణ యాత్రలు ప్రజలను బాగా ప్రభావితం చేశాయి. బారువా గ్రామ వీధుల్లో యువజనులను వెంట వేసుకొని భజన గీతాలు పాడుతూ వెళుతుంటే గ్రామమంతా దద్దరిల్లుతున్నట్లు కనిపించేది. సవర్ణులలో ఆశ్చర్యం, హరిజనులలో ఆశలు రేకెత్తించేవి. రాత్రి పాఠశాలలు నిర్వహించి బడుగు వర్గాల విద్యాభివృద్ధికి అతనెంతో కృషి చేశాడు. హరిజనులకు దేవాలయాలలో ప్రవేశం కలిగించారు. లచ్చన్న చేసిన ఆర్థిక సహాయంతో కుశాగ్రబుద్ధులైన ఎందరో హరిజన విద్యార్థులు ఉన్నత స్థానాల నలంకరించారు. ఆచార్య గోగినేని రంగాతో లచ్చన్న స్నేహం రాష్ట్ర రాజకీయాలలో ఒక నూతన శకాన్ని ఆరంభించింది. మహాత్మాగాంధీ, పండిట్ నెహ్రూ గురు శిష్య సంబంధం లాంటిదే రంగా లచ్చన్నల సంబంధం. 1935లో రాష్ట్రంలో కాంగ్రెస్ సోషలిస్టు పార్టీ శాఖ ఏర్పడినప్పుడు దానికి అతను సభ్యుడుగా ఎన్నికయ్యాడు. ఆ రోజుల్లో రైతు సంఘాలు కాంగ్రెస్ పార్టీలోని అంగాలే. 1939లో త్రిపురలో జరిగిన అఖిలభారత కాంగ్రెస్ మహాసభ, కిసాన్ సభలను ఆంధ్రలోని పలాసాలో జరపాలని తీర్మానించారు. రాహుల్ సాంకృత్యాయన్ ఈ సభలకు అధ్యక్షత వహించారు. ఈ సభలు జయప్రదం కావడానికి ప్రధానకారకుడు లచ్చన్నే. దీనితో ఆయన పేరూ, ఆయన కార్యదీక్ష దేశమంతటా తెలిసింది. లచ్చన్న అనేక కిసాన్ ఉద్యమాలు నడిపి ఆ రోజుల్లో జమీందార్ల పక్కల్లో బల్లెంగా తయరైనారు. 1942లో జరిగిన క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొన్న లచ్చన్నను ప్రభుత్వం అతి ప్రమాదకరమైన వ్యక్తిగా గుర్తించి, ఆయనను పట్టియిచ్చిన వారికి పదివేల రూపాయల బహుమతిని ప్రకటించింది. చివరకు ప్రభుత్వమే అతనిని బంధించి మూడేళ్ళు జైల్లో ఉంచి 1945 అక్టోబరులో విడుదల చేసింది. ఆనాటి నుంచి లచ్చన్న ఆంధ్ర అగ్రనాయకులలో ఒకరైనారు. 1947లో లచ్చన్న ఇండియన్ నేషనల్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ కు రాష్ట్ర శాఖ అధ్యక్షులయ్యారు. 1950లో ఆచార్య గోగినేని రంగా కృషి కార్ లోక్ పార్టీని స్థాపించినప్పుడు అందులో లచ్చన్న ప్రధాన పాత్ర పోషించాడు. 1953 అక్టోబరు 1 న ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం ఏర్పడిరది. మద్రాసు ప్రభుత్వం నుంచి ఆంధ్రులకు రావలసిన ఆస్తుల విభజనను పరిశీలించడానికై ఏర్పడిన ఆంధ్ర సంఘంలో కాంగ్రెస్ నుంచి నీలం సంజీవరెడ్డి, ప్రజా పార్టీ నుంచి తెన్నేటి విశ్వనాధం, కృషి కార్ లోక్ పార్టీనుంచి లచ్చన్న సభ్యులు. ప్రకాశం పంతులు మంత్రివర్గంలో, బెజవాడ గోపాలరెడ్డి మంత్రివర్గం లోనూ, లచ్చన్న మంత్రిగా పనిచేశారు. 1961లో రాజాజీ ఏర్పాటు చేసిన స్వతంత్ర పార్టీకి ఆంధ్రప్రదేశ్ శాఖకు సర్దార్ గౌతు లచ్చన్న అధ్యక్షుడు. 1978లో లచ్చన్న ఆంధ్రప్రదేశ్ శాసనసభలో అధికార ప్రతిపక్ష నాయకుడుగా ఉన్నాడు. పబ్లిక్ అక్కౌంట్స్ చైర్మన్ గా ఆ రోజుల్లో పనిచేశారు. కొంతకాలం బహుజన పార్టీలో పని చేసిన లచ్చన్న ఆ తరువాత అన్ని రాజకీయ పార్టీలతో తెగతెంపులు చేసుకుని, పార్టీలకు అతీతంగా బడుగు వర్గాల సంక్షేమానికి కృషి చేస్తూ వచ్చారు. అణగారిన వర్గాల ఆశాజ్యోతి సర్దార్ గౌతు లచ్చన్న 2006 ఏప్రిల్ 19 న కన్నుమూశారు.

# పుంభావ సరస్వతి వానమామలై

తెలుగుదేశం ఆధునికపు కవితా పోకడలకు అలవాటు పడిన కాలమది. భావకవిత్వం, అభ్యుదయ కవిత్వం, వచనకవిత్వం లాంటి ఎన్నో నూతన సాహిత్య ప్రయోగాలాతో వర్ధిల్లుతున్న కాలంలో, ప్రాచీన కవితారీతులతో ప్రజలను మెప్పించిన కవి వానమామలై. అమూల్య సాహిత్య సంపదను తెలుగువారి కందించిన అద్వితీయ కవితా విశారదుడు, వాగీశ్వరీ మంత్ర సిద్ధిని పొందిన మహనీయుడు పుంభావ సరస్వతి వానమామలై వరదాచార్య. ఒక మహాకవి పోతన చరిత్రను మరోకవి గ్రంధస్థం చేయడం విశేషమే మరి. వానమామలై (19141984), 1914 ఆగస్టు 16న వరంగల్ జిల్లా మడికొండ గ్రామంలో వైఖానస బ్రాహ్మణుల పండిత కుటుంబంలో జన్మించారు. రైతు కుటుంబములో జన్మించిన వరదాచార్యులు ఏడవ తరగతి వరకు మాత్రమే చదివి ఎల్... సంస్కృతాంధ్ర సాహిత్యం, తార్కికం, వేదాంతం, వ్యాకరణాలను అభ్యసించారు. సంస్కృతం, తెలుగు, ఉర్దూ, హిందీ, ద్రవిడం, మరాఠీ, ఇంగ్లీషు భాషలలో పట్టు సాధించారు. హరికథాగానంలో ప్రావీణ్యతను సంతరించుకున్నారు. ఈయన అన్నలైన వానమామలై వేంకటాచార్యులు, వానమామలై లక్ష్మణాచార్యులు, వానమామలై జగన్నాథా చార్యులు కూడా సాహిత్యకారులే. కాళోజీ, పల్లా దుర్గయ్య, ఆచార్య బిరుదురాజు రామరాజువంటి సాహితీ దిగ్గజాలు మడికొండకే చెందిన వారేకాక, ఆయన ఆత్మీయులు కూడా. ఆయన సహజ పాండిత్యాన్ని గుర్తించిన అప్పటి హైదరాబాద్ రాష్ట్ర ముఖ్యమంత్రి బూర్గుల రామకృష్ణారావు ప్రత్యేక ఉత్తర్వుల ద్వారా నిజామాబాద్ జిల్లా దోమకొండ జనతా కళాశాలలో సాంస్కృతిక కార్యక్రమ నిర్వాహకుడిగా నియమించారు. తర్వాత ఆంధ్ర సారస్వత పరిషత్తునుండి విశారద పట్టా పుచ్చుకున్నారు. విశారద పూర్తయ్యాక చెన్నూర్ ఉన్నత పాఠశాలకు బదిలీ అయ్యి 13 సంవత్సరాలు ఉపాధ్యాయుడిగా పనిచేసి 1972లో పదవీ విరమణ చేశారు. చెన్నూరులో వేదపాఠశాల నెలకొల్పారు. 1972లో అప్పటి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి పి.వి.నరసింహారావు శాసనమండలికి నామినేట్ చేయగా 1978 వరకు శాసనమండలి సభ్యుడిగా కొనసాగారు. 1968లో పోతన చరిత్రము గ్రంథానికి ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడెమీ అవార్డు, 1971లో ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడెమీ విశిష్ట సభ్యత్వము, 1973లో కరీంనగర్ జిల్లా కోరుట్లలో భారతీ సాహిత్య సమితి వారిచే గండపెండేరం, స్వర్ణ కంకణం, రాత్నాభిషేకం, 1976లో సంపూర్ణానంద సంస్కృత విశ్వ విద్యాలయం, వారణాసి వారిచే డి.లిట్ వాచస్పతి గౌరవ పట్టా పొందారు. అభినవ కాళిదాసు, మహాకవి శిరోమణి, ఆంధ్ర కవిత ఉత్ప్రేక్ష చక్రవర్తి, అభినవ పోతన, ఆంధ్ర కవివతంస, మధురకవి, కవి కోకిల, కవిశిరో వతంస తదితర బిరుదాంచితులైనారు.



తెలంగాణ ప్రజలను జాగృతం చేసేందుకు హైదరాబాద్ రాజ్యంలో (తెలంగాణ) నిజాం నియంతృత్వ పాలనను వర్ణిస్తూ అనేక పాటలు, పద్యాలు రాశారు. పౌరాణికుడిగా ప్రదర్శనలు ఇచ్చారు. హరికథలు, పురాణాలు చెప్పారు. ''పోతన చరిత్రము'' వ్రాసి ''అభినవ పోతన''గా వాసికెక్కిన వానమామలై తెలంగాణా కవులలో అగ్రగణ్యుడు, అపూర్వ సాహితీ దురంధరుడు.... దాశరథి కృష్ణమాచార్యులకు అతి సన్నిహితులు, ఆచార్య సి. నారాయణరెడ్డికి అత్యంత ఆప్తుడు, ఎన్నో గేయకృతులు, వ్యాసాలు, నాటకాలు, బుఱ్ఱకథలు ఎన్ని వ్రాసినా.. తెలుగు సాహిత్యంలో ఆయనకు సుస్థిర స్థానాన్ని సముపార్జించి పెట్టింది ''పోతన చరిత్రము''. మహాభాగవత కర్త మహాకవి బమ్మెర పోతన్న జీవిత విశేషాలను అద్వితీయ ప్రబంధంగా అందించిన ఘనత మన వరదన్నదే.
అలా తెలుగు రచయితల సంఘం ఆయనకు ''అభినవ పోతన'' బిరుదునిచ్చి సత్కరించింది.ఆయన వరదన్న పుట్టి పెరిగింది మడికొండలోనే అయినా స్థిరపడిరది తాత ముత్తాతల ఊరైన చెన్నూరులోనే. 'వరదన్నకు చిన్ననాటనే బాల్యగురువైన కాళోజీ రంగారావు శ్రీరామ తారక మంత్రోపదేశం గావించారు. మంథెనవాసి మేనమామ తిరువరంగం గోపాలాచార్యులు వాగీశ్వరి మంత్రోపదేశం చేయగా, ఖాజీపేట సమీపంలోగల మెట్టుగుట్టపై ఎనభైరోజులు కఠోరదీక్షతో ఉపాసించి వాణీ కటాక్ష వరసిద్ధిని పొందినట్లు చెపుతారు. ఇతని శతజయంతి ఉత్సవాలు 1882011 నుండి 1882012 వరకు జరిగాయి. ఈ సందర్భంగా అనేక సభలు సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా చెన్నూర్ లోని జగన్నాథ ఆలయానికి ఎదురుగా ఉన్న స్థలంలో ఆయన కాంస్య విగ్రహాన్ని నెలకొల్పారు. క్షయవ్యాధి పీడితుడై, ఊపిరి తిత్తులకు పది సార్లు శస్త్రచికిత్సతో ఒక ఊపిరితిత్తితోనే కడదాకా జీవించి, 1984, అక్టోబరు 30న ఈ లోకాన్ని వీడి వెళ్ళారు.



# తగ్గుతున్న బంగారం ధరలు..

**హైదరాబాద్, విజయవాడలో తులం ఎంతుందంటే..**

బులియన్ మార్కెట్‌లో బంగారం, వెండి ధరలు గతంలో ఎన్నడూ లేని విధంగా రికార్డు స్థాయిలో ట్రేడ్ అవుతున్నాయి.. ఇటీవల బంగారం ధర పది గ్రాములు ఏకంగా లక్షా 3 వేలు దాటింది.. వెండి కూడా అదే బాటలో కొనసాగుతోంది. వాస్తవానికి బంగారం, వెండి ధరలలో నిరంతరం మార్పు ఉంటుంది. కొన్నిసార్లు పెరుగుతూ, మరికొన్ని కొన్నిసార్లు తగ్గుతూ ఉంటాయి.. గత నాలుగు రోజుల క్రితం రికార్డు స్థాయిలో పెరిగిన బంగారం ధర.. తగ్గుతూ వస్తోంది.. ఆగస్టు 16 శనివారం ఉదయం ఆరుగంటల వరకు నమోదైన ధరల ప్రకారం.. దేశియంగా బంగారం ధర స్వల్పంగా తగ్గగా.. వెండి ధర స్వల్పంగా పెరిగింది. దేశియంగా బంగారం, వెండి ధరలు ఎలా ఉన్నాయో తెలుసుకోండి.. 24 క్యారెట్ల బంగారం పది గ్రాముల ధర రూ.10 మేర ధర తగ్గి.. రూ.1,01,230గా ఉంది.. 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.10 మేర ధర తగ్గి.. రూ.92,790 కి చేరుకుంది. వెండి కిలో ధర రూ.100 పెరిగి.. రూ.1,16, 200లుగా ఉంది. అయితే, ప్రాంతాల వారిగా బంగారం, వెండి ధరల్లో వ్యాత్యాసం ఉంటుంది.

ప్రధాన నగరాల్లో బంగారం ధరలు.. హైదరాబాద్‌లో 24 క్యారెట్ల పసిడి 10 గ్రాముల ధర రూ.1,01,230 ఉంటే.. 22 క్యారెట్ల బంగారం ధర రూ.92,790 ఉంది. కిలో వెండి ధర రూ.1,26,200 గా ఉంది. విజయవాడ, విశాఖపట్నంలో 24 క్యారెట్ల గోల్డ్ ధర రూ.1,01,230, 22 క్యారెట్ల ధర రూ.92,790 లుగా ఉంది. వెండి కిలో ధర రూ.1,26,200 లుగా ఉంది. ఢల్లీలో 24 క్యారెట్ల పసిడి ధర రూ.1,01,380, 22 క్యారెట్ల ధర రూ.92,940 లుగా ఉంది. కిలో వెండి ధర రూ.1,16,200 ఉంది. ముంబైలో 24 క్యారెట్ల పసిడి ధర రూ.1,01,230, 22 క్యారెట్ల ధర రూ.93,790 ఉంది. వెండి ధర కిలో రూ.1,16,200 ఉంది. చెన్నైలో 24 క్యారెట్ల బంగారం ధర రూ.1,01,230 ఉండగా.. 22 క్యారెట్ల ధర రూ.92,790 గా ఉంది. వెండి ధర కిలో రూ.1,26,200 ఉంది. బెంగళూరులో 24 క్యారెట్ల ధర రూ.1,01,230, 22 క్యారెట్ల ధర రూ.92,790 గా ఉంది. వెండి ధర కిలో రూ.1,16,200 ఉంది.

# ఐపీవోకి ఆర్‌ఎస్‌బీ రిటైల్..

**రూ.1,500 కోట్ల నిధుల సేకరణలో సంస్థ**




హైదరాబాద్, : ఆర్‌ఎస్ బ్రదర్స్, సౌత్ ఇండియా షాపింగ్ మాల్ పేర్లతో రిటైల్ అవుట్‌లెట్లను నిర్వహిస్తున్న ఆర్‌ఎస్‌బీ రిటైల్ ఇండియా లిమిటెడ్..స్టాక్ మార్కెట్లోకి అడుగుపెట్టడానికి సిద్ధమవుతున్నది. ఇందుకు సంబంధించి మార్కెట్ నియంత్రణ మండలి సెబీకి దరఖాస్తుచేసుకున్నది కూడా. ఈ ఐపీవో ద్వారా రూ.1,500 కోట్ల వరకు నిధులను సమీకరించాలని యోచిస్తున్నది. దీంట్లో తాజా ఈక్విటీలను జారీ చేయడంతో రూ.500 కోట్లు, ఆఫర్ ఫర్ సేల్ రూట్‌లో ప్రమోటర్లకు చెందిన 2.98 కోట్ల షేర్లను అమ్మకానికి పెట్టింది. ఇలా సేకరించిన నిధుల్లో రూ.275 కోట్లను రుణాల చెల్లింపుల కోసం, మరో రూ.118 కోట్లను నూతన స్టోర్లను ఏర్పాటు చేయడానికి వినియోగించనున్నది. ప్రస్తుతం సంస్థకు తెలంగాణతోపాటు ఆంధ్రప్రదేశ్, కర్ణాటకల్లో 22 నగరాల్లో 73 స్టోర్లను నిర్వహిస్తున్నది. సౌత్ ఇండియా షాపింగ్ మాల్, ఆర్‌ఎస్ బ్రదర్స్, కాంచీపురం నారాయణి సిల్క్స్, డీఏ రాయల్, వాల్యూ జోన్ హైపర్ మార్ట్ పేర్లతో అవుట్‌లెట్లను నిర్వహిస్తున్నది. 202425 ఆర్థిక సంవత్సరంలో రూ.2,694 కోట్ల ఆదాయంపై రూ.104.4కోట్ల నికర లాభాన్ని గడిరచింది. దేశీయ రిటైల్ రంగం అంచనాలకుమించి రాణిస్తున్నదని, గడిచిన ఆర్థిక సంవత్సరానికి గాను రూ.92.6 లక్షల కోట్లుగా నమోదైంది. దీంట్లో దుస్తులు, యాక్సెసరీస్ రూ.6.90 లక్షల కోట్లుగా ఉన్నది.

# 2050 నాటికి కోటి రూపాయల విలువెంత



ద్రవ్యోల్బణం ఎందుకు పొదుపును హరిస్తుంది?

ఇవాళ మీరు కోటి రూపాయలు సంపాదిస్తే అది ఒక పెద్ద మొత్తం అని మీరు భావించవచ్చు. కానీ, 2050 నాటికి ఈ కోటి రూపాయల విలువ ఎంత ఉంటుందో మీరు ఎప్పుడైనా ఆలోచించారా? ద్రవ్యోల్బణం కారణంగా ఈ రోజు ఉన్న కోటి రూపాయల విలువ కేవలం రూ. 29.53 లక్షలకు పడిపోవచ్చు. ఈ నేపథ్యంలో, ద్రవ్యోల్బణాన్ని అధిగమించి ఆర్థిక భద్రత పొందడానికి సరైన పెట్టుబడి ప్రణాళిక ఎంత అవసరమో తెలుసుకుందాం. ద్రవ్యోల్బణం అంటే వస్తువులు, సేవల ధరలు పెరిగి, డబ్బు కొనుగోలు శక్తి తగ్గడం. గత 2025 సంవత్సరాలలో భారత దేశంలో రిటైల్ ద్రవ్యోల్బణం సగటున 6% కంటే ఎక్కువగా ఉంది. అయితే, రాబోయే 25 సంవత్సరాలకు ఇది సగటున 5% ఉండవచ్చని అంచనా వేస్తున్నారు. ఈ 5% ద్రవ్యోల్బణం రేటుతో లెక్కించినట్లయితే, ఈ రోజు ఉన్న కోటి రూపాయల విలువ 2050 నాటికి కేవలం రూ. 29.53 లక్షలకు సమానంగా ఉంటుంది. అంటే, ఈ రోజు కోటి రూపాయలకు లభించే వస్తువులు, సేవలు 25 సంవత్సరాల తర్వాత పొందడానికి సుమారు రూ. 3.4 కోట్లు అవసరమవుతాయి. ఉదాహరణకు, ఈ రోజు మీ కుమార్తె వివాహం కోసం కోటి రూపాయలు ఖర్చు చేస్తే, 25 సంవత్సరాల తర్వాత అదే స్థాయి వివాహానికి సుమారు రూ. 3.4 కోట్లు అవసరమవుతాయి. ద్రవ్యోల్బణం మీ పొదుపును నెమ్మదిగా హరించివేస్తుందని ఇది స్పష్టంగా చూపిస్తుంది.

ద్రవ్యోల్బణాన్ని అధిగమించడానికి 5 సురక్షితమైన పెట్టుబడి మార్గాలు

మీ పెట్టుబడులు ద్రవ్యోల్బణం కంటే ఎక్కువ రాబడిని అందించాలి. మీ లక్ష్యం సురక్షితమైన, స్థిరమైన రాబడి అయితే, ప్రభుత్వ పథకాలు, బ్యాంక్ ఆధారిత పెట్టుబడులు ఉత్తమమైనవి. ఆగస్టు 2025 నాటికి ఉన్న వడ్డీ రేట్లతో కొన్ని సురక్షితమైన పెట్టుబడి ఎంపికలను పరిశీలిద్దాం.



# పతంజలి ఫుడ్స్ డబుల్ బొనాంజా..

- **100 షేర్లకు 150 షేర్లు.. రూ. 2 డివిడెండ్.. మీరూ కొన్నారా.?**

పతంజలి ఫుడ్స్ లిమిటెడ్ జూన్ 30తో ముగిసిన త్రైమాసిక ఫలితాల్లో అదరగొట్టింది. కంపెనీ ఆదాయం, లాభాలు గణనీయంగా పెరిగాయి. అయితే పట్టణ మార్కెట్లలో డిమాండ్ తగ్గడంతో పాటు ప్రాంతీయ బ్రాండ్ల నుంచి పోటీ పెరగినట్లు కంపెనీ తెలిపింది. అయితే గ్రామీణ మార్కెట్లలో మాత్రం డిమాండ్ స్థిరంగా ఉందని చెప్పింది. పతంజలి ఫుడ్స్ కార్యకలాపాల ద్వారా మొత్తం రూ. 8,899.70 కోట్లు ఆదాయాన్ని ఆర్జించింది. గతేడాది ఇదే త్రైమాసికంలో వచ్చిన రూ. 7,177.17 కోట్లతో పోలిస్తే ఇది చాలా ఎక్కువ. కంపెనీ స్థూల లాభం 23.81శాతం పెరిగి రూ. 1,259.19 కోట్లుగా నమోదైంది. పన్నుల తర్వాత నికర లాభం రూ. 180.39 కోట్లుగా ఉంది. ఇది మొత్తం ఆదాయంలో 2.02శాతం.

ఈ విభాగాల నుంచి ఆదాయం ,కంపెనీ ఆదాయంలో ఎడిబుల్ ఆయిల్ ప్రధాన పాత్ర పోషించింది.

ఎడిబుల్ ఆయిల్ : రూ. 6,685.86కోట్లు

షాపింగ్ ట్రెండ్

ప్రస్తుత ఆర్థిక పరిస్థితుల్లో పట్టణ వినియోగదారులు తక్కువ ధర కలిగిన లేదా చిన్న ప్యాక్‌ల వైపు మొగ్గు చూపుతున్నారని.. అదే సమయంలో ప్రాంతీయ బ్రాండ్లకు ఆదరణ పెరుగుతోందని పతంజలి తెలిపింది. ఈ ట్రెండ్‌ను దృష్టిలో ఉంచుకుని, పతంజలి చిన్న ప్యాక్‌లు, విలువ ఆధారిత ఉత్పత్తులను ప్రోత్సహిస్తూ ఆహార ఉత్పత్తులలో వృద్ధిని సాధించింది. "సమృద్ధి అర్బన్ లాయల్టీ ప్రోగ్రామ్" వంటి కార్యక్రమాలు కూడా కస్టమర్లను నిలబెట్టుకోవడంలో సహాయపడ్డాయి.

**డివిడెండ్ బోనస్ షేర్లు**

జూన్ త్రైమాసిక ఫలితాలతో పాటు, పతంజలి ఫుడ్స్ 2025 ఆర్థిక సంవత్సరానికి ఒక్కో షేరుకు రూ.2 తుది డివిడెండ్ ప్రకటించింది. ఈ డివిడెండ్‌కు రికార్డు తేదీగా సెప్టెంబర్ 3ను నిర్ణయించారు. ఈ తేదీ నాటికి షేర్లు కలిగిన వాటాదారులు డివిడెండ్ పొందేందుకు అర్హులు. ఇప్పటికే జూలై నెలలో కంపెనీ 2:1 నిష్పత్తిలో బోనస్ షేర్లను ప్రకటించింది. అంటే వాటాదారులు తమ వద్ద ఉన్న ప్రతి ఒక షేరుకు రెండు కొత్త షేర్లను ఉచితంగా పొందుతారు. అయితే ఈ బోనస్ షేర్ల రికార్డు తేదీని ఇంకా ప్రకటించలేదు.

# స్విగ్గీ ప్లాట్‌ఫామ్ ఫీజు పెంపు..

- **ఫెస్టివల్ సీజన్‌లో వినియోగదారులపై ప్రభావం**




ఫుడ్ లవర్స్ కి కీలక అలర్ట్. ఎందుకంటే ప్రముఖ ఆన్‌లైన్ ఫుడ్ ఆర్డరింగ్, డెలివరీ ప్లాట్‌ఫామ్ స్విగ్గీ, హై డిమాండ్ ప్రాంతాల్లో తన ఫీజును 17% పెంచి రూ.14కి చేర్చింది. ఇది పండుగ సీజన్‌లో పెరిగిన డిమాండ్ కారణంగా తాత్కాలిక చర్య అని చెబుతున్నారు. స్విగ్గీ ప్లాట్‌ఫామ్ ఫీజు పెంపు..ఫెస్టివల్ సీజన్‌లో వినియోగదారులపై ప్రభావం మీరు గత కొన్ని రోజులుగా ఆన్‌లైన్‌లో ఫుడ్ ఆర్డర్ చేస్తే బిల్ కొంచెం ఎక్కువగా అనిపించిందా? దీనికి మీరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ఎందుకంటే ఇండియాలో అగ్రగామిగా ఉన్న ఫుడ్ డెలివరీ ప్లాట్‌ఫామ్ స్విగ్గీ, పలు ప్రాంతాల్లో తన ఫీజును రూ. 14కి పెంచింది . ఇది దాదాపు 17% పెంపు. కానీ ఇది తాత్కాలిక చర్య అని కంపెనీ చెబుతోంది. ఫెస్టివల్ సీజన్ సమయంలో కొన్ని హై డిమాండ్ ఉన్న ప్రాంతాల్లో ఎక్కువ ఆర్డర్లను హ్యాండిల్ చేయడం కోసం ఈ ఫీజు పెంపు చేసినట్టు తెలుస్తోంది. ఇది లాంటి సర్జ్ ప్రైసింగ్ విధంగా అనిపించవచ్చు.

మొదట రూ.2, కానీ ఇప్పుడు

స్విగ్గీ చెబుతోందే ఇది స్థిరమైన మార్పు కాదు. పండుగల సమయంలో మాత్రమే అమలవుతోంది. దీని తర్వాత అదే విధంగా కొనసాగుతుందా లేదా అనేది ఫలితాలపై ఆధారపడి ఉంటుంది. ఈ ప్లాట్‌ఫారమ్ ఫీజు 2023లో మొదట ప్రవేశపెట్టినప్పుడు కేవలం రూ. 2 మాత్రమే. ఇప్పుడు కొన్ని ప్రాంతాల్లో అది రూ. 14కి చేరింది, అంటే 600% పెరిగింది. ఇది చిన్నదిగా అనిపించిన ఫీజు ఇప్పుడు బాగా పెరిగింది. ప్రత్యర్థి జొమాటో మాత్రం తన ఫీజును ఇప్పటికీ రూ. 10 వద్ద కొనసాగిస్తోంది.

**ఇదొక స్థాయిలో మార్పు**

ఇది ఒక్క స్విగ్గీ విషయంలోనే కాదు. ఫుడ్ డెలివరీ, క్విక్ కామర్స్ రంగంలో మొత్తం చూస్తే లాంటి సంస్థలు కూడా ప్లాట్‌ఫామ్ లేదా హ్యాండ్లింగ్ ఫీజులను మెల్లిగా పెంచుతున్నాయి. ప్రస్తుతం ఈ ఫీజులు రూ. 9 నుంచి రూ. 15 వరకు ఉన్నాయి. ఇది సగటు ఆర్డర్ విలువలో ఇది 1% నుంచి 3% వరకూ ఉంటుంది. ఆశ్చర్యకరమైన విషయం ఏంటంటే, ఈ ఫీజులు పెరిగినా కూడా వినియోగదారుల ఆర్డర్లు తగ్గడం లేదు.

**పేర్లు మారినా ఉద్దేశం ఒకటే**

ఒక్కో యాప్ ఒక్కో పేరుతో ఫీజులను చూపిస్తుంటుంది. హ్యాండ్లింగ్ ఫీజు, కన్వీనియెన్స్ ఛార్జ్ లేదా స్మాల్ ఆర్డర్ ఫీజు. వీటి ఉద్దేశం మాత్రం ఒక్కటే, రెవెన్యూ పెంచుకోవడం. స్విగ్గీ, జొమాటో లాంటి కంపెనీలు ఒక్కో ఆర్డర్ పై రూ. 5 ఫీజు పెంచినా, లక్షల ఆర్డర్ల స్థాయిలో చూస్తే ఇది కోట్ల ఆదాయంగా మారుతుంది. గతంలో ఈ కంపెనీలు డిస్కౌంట్లు, ఫ్రీ డెలివరీలతో కస్టమర్లను ఆకర్షించేవి. ఇప్పుడు వారు ప్రాఫిట్ చేయాలనే దిశగా మారుతున్నట్లుగా అనిపిస్తుంది.

# మీ లోన్ ఇంకా మంజూరు కాలేదా..

**ఇవి పాటించండి, వెంటనే అప్రూవల్**

మీరు లోన్ కోసం అప్లై చేసినా కూడా ఇంకా మంజూరు కాలేదా. ఇలాంటి క్రమంలో మీరు కొన్ని విషయాలను తప్పకుండా తెలుసుకోవాలి. లోన్ అప్లై చేసే ముందు కొన్ని విషయాలు పాటించడం ద్వారా మీరు వేగంగా రుణం పొందే అవకాశం ఉంటుంది. మీరు చేసే చిన్న చిన్న తప్పులు మీకు లోన్ ఆలస్యంగా వచ్చేలా చేస్తాయి. అయితే ఆ తప్పులు ఏంటి, ఏం చేయకుండా ఉండాలనే విషయాలను ఇప్పుడు తెలుసుకుందాం.

**1. అసంపూర్తి డాక్యుమెంట్లు**

లోన్ అప్లై చేసేటప్పుడు సాధారణ తప్ప డాక్యుమెంట్ల సమర్పణలో జరుగుతుంది. ఆధార్ కార్డు, పాన్ కార్డు, ఆదాయ రుజువు, బ్యాంక్ స్టేట్‌మెంట్ లేదా ఇతర ముఖ్యమైన పత్రాలు అసంపూర్తిగా ఉంటే, బ్యాంకు మీ అప్లికేషన్‌ను తిరస్కరించవచ్చు లేదా ఆలస్యం చేయవచ్చు. ఇలాంటి సమయంలో బ్యాంకు అడిగిన అన్ని డాక్యుమెంట్ల లిస్టును ముందుగా తెలుసుకుని, సరిగ్గా సమర్పించండి. డాక్యుమెంట్ల శాలరీ స్లిప్, స్టేట్ మెంట్ సహా అన్ని వివరాలను ఒకటికి రెండు సార్లు చెక్ చేసుకుని సమర్పించండి.

**2. సిబిల్ స్కోర్ సమస్యలు**

మీ సిబిల్ స్కోర్ లోన్ మంజూరులో కీలక పాత్ర పోషిస్తుంది. 750 కంటే తక్కువ స్కోర్ ఉంటే, బ్యాంకులు మీ అప్లికేషన్‌ను సీరియస్‌గా తీసుకుంటాయి. క్రెడిట్ కార్డ్ బిల్లులు ఆలస్యంగా చెల్లించడం, గతంలో తీసుకున్న లోన్ల రీపేమెంట్‌లో జాప్యం వంటివి సిబిల్ స్కోర్‌ను దెబ్బతీస్తాయి. లోన్ అప్లై చేయడానికి ముందే మీ సిబిల్ స్కోర్‌ను చెక్ చేసుకోండి. ఒకవేళ స్కోర్ తక్కువగా ఉంటే, క్రెడిట్ కార్డ్ బిల్లులు, ఇతర ఈఎంఐలను చెల్లించి స్కోర్ పెంచుకున్న తర్వాత అప్లై చేయండి.

**3. తప్పుడు సమాచారం**

అప్లికేషన్ ఫారమ్‌లో తప్పుడు సమాచారం ఇవ్వడం మరో పెద్ద తప్పు. ఉదాహరణకు మీ ఆదాయం, ఉద్యోగ వివరాలు లేదా ఇతర




వ్యక్తిగత సమాచారాన్ని తప్పుగా ఇస్తే, బ్యాంకు వెరిఫికేషన్ సమయంలో మీ అప్లికేషన్‌ను తిరస్కరిస్తారు. ఎల్లప్పుడూ నిజాయితీగా సమాచారం ఇవ్వండి. బ్యాంకు అధికారులతో సంప్రదించి, మీ సమాచారం సరిగ్గా ఉందని నిర్ధారించుకోండి.

**4. లోన్ గురించి స్పష్టత లేకపోవడం**

చాలామంది తమకు ఏ రకమైన లోన్ అవసరమో స్పష్టంగా నిర్ణయించుకోకుండా అప్లై చేస్తారు. ఉదాహరణకు హోమ్ లోన్, పర్సనల్ లోన్, బిజినెస్ లోన్ ప్రతి లోన్‌కు భిన్నమైన అర్హతలు, డాక్యుమెంట్లు అవసరం అవుతాయి. మీ అవసరాలను బట్టి లోన్ రకాన్ని ఎంచుకోండి. బ్యాంకు అధికారులతో లేదా ఫైనాన్షియల్ అడ్వైజర్‌తో మాట్లాడి సరైన లోన్ ఎంపిక చేసుకోండి.


**5. ఎక్కువ లోన్ అప్లికేషన్లు**

ఒకేసారి అనేక బ్యాంకులలో లోన్ కోసం అప్లై చేయడం వల్ల కూడా ఇబ్బందులు వస్తాయి. ఇది మీ సిబిల్ స్కోర్‌పై ప్రతికూల ప్రభావం చూపుతుంది. అలాంటి క్రమంలో బ్యాంకులు మిమ్మల్ని ఆర్థికంగా అస్థిరంగా భావించవచ్చు. అందుకే ఒకటి లేదా రెండు బ్యాంకులలో మాత్రమే అప్లై చేయండి. మీ అప్లికేషన్ తిరస్కరిస్తే, కారణాలను తెలుసుకుని తర్వాత కొన్ని రోజులకు అప్లై చేయండి .

**6. ఆర్థిక ప్రణాళిక లేకపోవడం**

లోన్ తీసుకునే ముందు దానిని ఎలా తిరిగి చెల్లించాలనే ప్రణాళిక కూడా చాలా ముఖ్యం. బ్యాంకులు మీ ఆర్థిక స్థిరత్వాన్ని, రీపేమెంట్ సామర్థ్యాన్ని చెక్ చేస్తాయి. మీ ఆదాయం, ఖర్చుల వివరాలను తెలుసుకుంటాయి. మీ ఖర్చులు ఎక్కువగా ఉంటే కూడా లోన్ వచ్చే ఛాన్స్ తక్కువగా ఉంటుంది. ఇవన్నీ కూడా సరిగ్గా ఉంటే మీకు లోన్ వెంటనే మంజూరు అవుతుంది

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



# విమానం నడపడం చూపిస్తూ చిక్కుల్లో పడ్డ పైలట్!

విమానం నడుపుతున్న తనను చూసి కుటుంబ సభ్యులు మురిసిపోవాలనుకున్నాడో ఏమో గానీ, ఓ పైలట్ చేసిన పని అతడి ఉద్యోగానికే ఎసరు తెచ్చింది. లండన్‌లోని హీత్రూ నుంచి న్యూయార్క్ వెళ్తున్న బ్రిటిష్ ఎయిర్‌వేస్ విమానంలో ప్రయాణ సమయంలో కాక్‌పిట్ డోర్‌ను తెరిచే ఉంచి, ఉగ్రవాద నిరోధక చట్టాలను ఉల్లంఘించిన ఆరోపణలపై సస్పెన్షన్‌కు గురయ్యాడు. ఇటీవల హీత్రూ-న్యూయార్క్ విమానంలో ఓ పైలట్ కాక్‌పిట్ డోర్‌ను మూయకుండానే విమానాన్ని నడిపాడు. అదే విమానంలో ప్రయాణిస్తున్న తన కుటుంబ సభ్యులకు, తాను విమానాన్ని ఎలా ఆపరేట్ చేస్తానో చూపించాలనే ఉద్దేశంతోనే ఇలా చేసినట్లు తెలుస్తోంది. అయితే, విమానం గాల్లో ఉండగా కాక్‌పిట్ డోర్ తెరిచి ఉండటాన్ని గమనించిన ప్రయాణికులు, సిబ్బంది తీవ్ర ఆందోళనకు గురయ్యారు. ఏం జరుగుతుందో తెలియక భయపడిపోయారు. ఈ ఘటనపై తోటి సిబ్బంది తీవ్రంగా స్పందించారు. విమానం న్యూయార్క్‌లో ల్యాండ్ అయిన వెంటనే, అక్కడి అధికారులకు ఆ పైలట్‌పై ఫిర్యాదు చేశారు. 9/11 ఉగ్రదాడుల తర్వాత విమానయాన భద్రతా నిబంధనలను అత్యంత కఠినంగా అమలు చేస్తున్నారు. ప్రయాణ సమయంలో కాక్‌పిట్ డోర్‌ను లాక్ చేసి ఉంచడం తప్పనిసరి. ఈ నిబంధనను పైలట్ ఉల్లంఘించడం తీవ్రమైన నేరంగా పరిగణించిన బ్రిటిష్ ఎయిర్‌వేస్ యాజమాన్యం, అతడిని తక్షణమే సస్పెండ్ చేసింది. కాక్‌పిట్ డోర్ చాలా సేపు తెరిచే ఉంది. ఇది ప్రయాణికులను తీవ్ర భయాందోళనకు గురిచేసింది. తోటి సిబ్బంది కూడా కలవరపడి అమెరికాలో రిపోర్ట్ చేయడంతో, యాజమాన్యం అతడిని సస్పెండ్ చేయాల్సి వచ్చింది. అని సంబంధిత వర్గాలు అంతర్జాతీయ మీడియాకు వెల్లడిరచాయి. పైలట్ సస్పెన్షన్ కారణంగా, ఈ నెల 8న న్యూయార్క్ నుంచి లండన్‌కు రావాల్సిన తిరుగు ప్రయాణ విమానాన్ని రద్దు చేశారు. ఆ విమానంలో టికెట్లు బుక్ చేసుకున్న ప్రయాణికులకు సంస్థ ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసింది.

# స్వదేశానికి బయల్దేరిన శుభాన్షు శుక్లా

**ప్రధాని మోదీతో భేటీ అయ్యే అవకాశం**




భారత వ్యోమగామి, గ్రూప్ కెప్టెన్ శుభాన్షు శుక్లా స్వదేశానికి బయల్దేరారు. రేపు భారత్‌లో ల్యాండ్ కానున్నారు. సోమవారం ప్రధాన మంత్రి నరేంద్ర మోదీని శుభాన్షు కలిసే అవకాశం ఉందని సంబంధిత వర్గాలు తాజాగా వెల్లడిరచాయి. కాగా, ఆక్సియం4 మిషన్ ద్వారా శుభాన్షు ఇటీవలే అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి వెళ్లి వచ్చిన విషయం తెలిసిందే.

ఐఎస్ఎస్ యాత్ర తర్వాత ఆయన తొలిసారి భారత్‌కు వస్తున్నారు. విమానంలో చిరునవ్వులు చిందిస్తూ దిగిన ఫొటోను శుభాన్షు సోషల్ మీడియాలో పోస్టు చేశారు. స్నేహితులు, కుటుంబ సభ్యులను కలిసేందుకు ఆసక్తిగా ఎదురుచూస్తున్నట్లు తన పోస్టులో రాసుకొచ్చారు. కాగా, శుభాన్షు రేపు భారత్‌లో ల్యాండ్ కానున్నారు. ఆ తర్వాత ప్రధాని మోదీని కలిసే అవకాశం ఉందని సంబంధిత వర్గాలు తాజాగా వెల్లడిరచాయి. అంతేకాదు ఆగస్టు 23న జరిగే జాతీయ అంతరిక్ష దినోత్సవ వేడుకల్లో పాల్గొననున్నట్లు పేర్కొన్నాయి. యాక్సియం4 మిషన్‌లో భాగంగా శుక్లా బృందం ఈ ఏడాది జూన్‌లో ఐఎస్ఎస్‌కు వెళ్లిన విషయం తెలిసిందే. ఈ మిషన్‌కు శుక్లా చీఫ్ పైలట్‌గా వ్యవహరించారు. ఐఎస్ఎస్‌లో 18 రోజుల పాటూ గడిపిన ఆయన 60కిపైగా శాస్త్రీయ పరిశోధనల్లో పాల్గొన్నారు. శుభాన్షు బృందం జులై 15న క్షేమంగా భూమికి తిరిగి వచ్చింది. ఇక అంతరిక్షంలోకి వెళ్లిన రెండో భారత వ్యోమగామిగా శుభాన్షు శుక్లా రికార్డు క్రియేట్ చేశారు. 1984లో సోవియట్ యూనియన్‌కు చెందిన ఇంటర్‌కాస్మోస్ మిషన్ కింద సూయజ్ టీ11 వ్యోమనౌకలో భారత వ్యోమగామి రాకేశ్‌శర్మ తొలిసారిగా అంతరిక్షంలోకి వెళ్లి ఎనిమిది రోజులపాటు ఉండి తిరిగి వచ్చారు. తాజా ప్రయోగంతో 41 ఏండ్ల తర్వాత రోదసిలోకి వెళ్లి వచ్చిన రెండో భారతీయుడిగా శుభాన్షు రికార్డు సృష్టించారు. ఐఎస్ఎస్‌లోకి వెళ్లి వచ్చిన తొలి భారతీయుడు కూడా ఇతనే కావడం విశేషం.

# పనిచేయని మరో 7 గేట్లు..

**తుంగభద్ర డ్యామ్‌కు పొంచిఉన్న ముప్పు**



**బెంగళూరు:** కర్ణాటక హోస్పేటలోని తుంగభద్ర జలాశయం మరోసారి ప్రమాదపుటంచున నిలిచింది. గతేడాది ఇదే నెలలో వరద ఉధృతికి 19వ గేటు కొట్టుకోపోయిన విషయం తెలిసిందే. దీంతో దానిని స్టాప్‌లాగ్‌లను ఏర్పాటు చేసి తాత్కాలికంగా మరమ్మతులు చేశారు. తాజాగా జలాశయంలోని మొత్తం 33 గేట్లలో మరో ఏడు గేట్లు పని చేయడం లేదని తేలింది. దీంతో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో డ్యామ్ భద్రతపై సర్వత్రా ఆందోళన నెలకొన్నది. గతేడాది ఆగస్టు 10న వచ్చిన వరదలకు డ్యామ్ 19వ గేటు కొట్టుకుపోయింది. దీంతో కన్నయ్యనాయుడు సలహాతో స్టాప్‌లాగ్‌లను ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. కొత్తగేటు తయారు చేసినప్పటికీ ఈ ఏడాది ముందస్తు వరదలతో ఆ గేటును అమర్చలేకపోయారు. కాగా, జలాశయానికి ఉన్న మొత్తం గేట్ల కాలపరిమితి దాటిపోయిందని, అన్నిటినీ మార్చాల్సిందేనని ఆయన సూచించారు. వచ్చే ఏడాది జూన్‌లోగా మొత్తం 33 గేట్లను మార్చాలన్న ఉద్దేశంతో జలాశయం సమీపంలోని గదగలో గేట్ల నిర్మాణం పనులు వేగంగా సాగుతున్నాయి. అయితే మరో ఏడు గేట్లు (4, 11, 18, 20, 24, 27, 28) ప్రమాదంలో ఉన్నాయని అధికారులు గుర్తించారు. దీంతో ఎంత వరద వచ్చినా వాటిని మాత్రం ఎత్తకూడదని ఇంజినీర్లు నిర్ణయించినట్లు తెలుస్తున్నది. 4వ గేటునూ ఓ అడుగుదాకా ఎత్తవచ్చు, తరువాత అదీ మొరాయించే అవకాశం ఉందని తెలిసింది. ప్రస్తుతం జలాశయానికి 23 వేల క్యూసెక్కుల వరద ప్రవాహం వచ్చి చేరుతున్నది. మూడు గేట్లను మాత్రమే పైకెత్తి 9 వేల క్యూసెక్కుల నీటిని నదికి విడుదల చేస్తున్నారు. మిగిలిన వరదను కాలువలకు వదులుతున్నారు.

# మెత్తబడిన ట్రంప్.. ఆంక్షలు ఉండకపోవచ్చని సంకేతం

- రష్యా నుంచి చమురు కొనుగోలుపై భారత్‌కు ఊరట
- భారత్ ఇప్పుడు రష్యాకు కీలక ఆయిల్ క్లయింట్ కాదన్న ట్రంప్
- సెకండరీ టారిఫ్‌లు విధించకపోవచ్చని సంకేతాలు
- అమెరికా నుంచి భారీగా చమురు, గ్యాస్ కొంటున్న భారత్



రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తున్న భారత్‌పై సెకండరీ టారిఫ్‌లు విధించే విషయంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కాస్త మెత్తబడినట్లు కనిపిస్తోంది. ప్రస్తుత పరిస్థితుల్లో భారత్‌పై ఆంక్షలు విధించాల్సిన అవసరం రాకపోవచ్చని ఆయన సంకేతాలు ఇచ్చారు. రష్యా ఇప్పటికే భారత్ రూపంలో ఒక కీలకమైన ఆయిల్ క్లయింట్‌ను కోల్పోయిందని ఆయన వ్యాఖ్యానించడం గమనార్హం. పుతిన్‌తో భేటీ కోసం అలాస్కా పర్యటనకు వెళ్తూ ఎయిర్ ఫోర్స్ వన్ విమానంలో ఫాక్స్ న్యూస్‌తో ట్రంప్ మాట్లాడారు. ''పుతిన్ ఒక కీలకమైన ఆయిల్ క్లయింట్‌ను కోల్పోయారు. అదే భారత్. ఆ దేశం సుమారు 40 శాతం చమురును కొనుగోలు చేసేది'' అని ఆయన అన్నారు. ''ఒకవేళ నేను సెకండరీ టారిఫ్‌లు విధించాల్సి వస్తే, అది వారికి చాలా నష్టం కలిగిస్తుంది. అవసరమైతే నేను ఆ పని చేస్తాను. బహుశా ఆ అవసరం రాకపోవచ్చు'' అని ట్రంప్ వివరించారు. వాస్తవానికి, ఆగస్టు 27 నుంచి భారత్‌పై 25 శాతం సెకండరీ టారిఫ్‌లు అమల్లోకి వచ్చే అవకాశం ఉందని వార్తలు వచ్చాయి. అలాస్కాలో ట్రంప్, పుతిన్ మధ్య చర్చలు సఫలం కాకపోతే భారత్‌పై ఆంక్షలు మరింత పెరగవచ్చని అమెరికా ట్రెజరీ సెక్రటరీ స్కాట్ బెస్సెంట్ కూడా ఈ వారం మొదట్లో హెచ్చరించారు. ఈ నేపథ్యంలో ట్రంప్ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

మరోవైపు, భారత్ వ్యూహాత్మకంగా వ్యవహరిస్తోంది. అమెరికా నుంచి చమురు, గ్యాస్ కొనుగోళ్లను గణనీయంగా పెంచింది. ఈ ఏడాది జనవరి నుంచి జూన్ మధ్య అమెరికా నుంచి భారత్ చమురు, గ్యాస్ దిగుమతులు 51 శాతం పెరిగాయి. అలాగే, 202425 ఆర్థిక సంవత్సరంలో అమెరికా నుంచి ఎల్ఎన్‌జీ దిగుమతులు 2.46 బిలియన్ డాలర్లకు చేరాయి. ఇది గతేడాది 1.41 బిలియన్ డాలర్లుగా ఉంది. అమెరికాతో వాణిజ్య లోటును తగ్గించడం ట్రంప్ ప్రభుత్వ ముఖ్య లక్ష్యాల్లో ఒకటి కావడంతో భారత్ చర్యలు సానుకూల ప్రభావం చూపుతున్నట్లు కనిపిస్తోంది. ఈ ఆంక్షల ప్రతిపాదన అన్యాయమని భారత ప్రభుత్వం ఇప్పటికే స్పష్టం చేసింది. తమ దేశ ఆర్థిక భద్రత, జాతీయ ప్రయోజనాలను కాపాడుకోవడానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని తేల్చిచెప్పింది. అమెరికాతో వాణిజ్య లోటును తగ్గించేందుకు 2025 నాటికి ఇంధన దిగుమతులను 25 బిలియన్ డాలర్లకు పెంచుతామని ప్రధాని నరేంద్ర మోదీ గత ఫిబ్రవరిలోనే హామీ ఇచ్చారు.

# భారీ వర్షాలకు హిమాచల్ అతలాకుతలం

- 257 మంది మృతి.. భారీగా ఆస్తి నష్టం



హిల్ స్టేట్ హిమాచల్ ప్రదేశ్‌ను భారీ వర్షాలు అతలాకుతలం చేశాయి. క్లౌడ్‌బరస్ట్, ఆకస్మిక వరదలకు భారీగా ఆస్తి, ప్రాణ నష్టం సంభవించింది. ఈ ఏడాది జూన్ 20న రుతుపవనాలు ప్రారంభమైనప్పటి నుంచి రాష్ట్ర వ్యాప్తంగా 250 మందికిపైగా ప్రాణాలు కోల్పోయారు. రాష్ట్ర విపత్తు నిర్వహణ అథారిటీ తెలిపిన వివరాల ప్రకారం.. రుతుపవనాలు ప్రారంభమైనప్పటి నుంచి రాష్ట్ర వ్యాప్తంగా 257 మంది ప్రాణాలు కోల్పోయారు. అందులో వర్షం కారణంగా సంభవించిన ప్రమాదాలు.. కొండచరియలు విరిగిపడటం, ఆకస్మిక వరదలు, క్లౌడ్‌బరస్‌ట్‌లు, ఇళ్లు కూలిపోవడం, నీటిలో మునిగిపోవడం, విద్యుత్ షాక్ వంటి ప్రమాదాల కారణంగా 133 మంది మరణించగా, రోడ్డు ప్రమాదాల్లో 124 మంది ప్రాణాలు కోల్పోయారు.

అత్యధికంగా మండి జిల్లా తీవ్రంగా ప్రభావితమైంది. ఈ జిల్లాలో వర్షం కారణంగా సంభవించిన ప్రమాదాల్లో 26 మంది మరణించారు. ఆ తర్వాత కాంగ్రాలో 28 మంది, చంబాలో 10 మంది, కులులో 11 మంది ప్రాణాలు కోల్పోయారు. ఇక బిలాస్‌పూర్, కిన్నౌర్, సిమ్లా, సిర్మౌర్, సోలన్, లాహౌత్‌స్పితి, హమీర్‌పూర్, ఉనాలో కూడా మరణాలు సంభవించాయి. రోడ్డు ప్రమాదాల కారణంగా మండి (21), చంబా (20), సిమ్లా (15), కాంగ్రా (12), కిన్నౌర్‌లో 12 మరణాలు సంభవించాయి. ఇక ఇప్పటి వరకూ 331 మంది గాయపడ్డారు. ఈ వర్షాలకు భారీగా ఆస్తి నష్టం కూడా సంభవించింది. రోడ్డు, విద్యుత్ లైన్లు, నీటి సరఫరా పథకాలు వంటి ప్రజా మౌలిక సదుపాయాలూ తీవ్రంగా దెబ్బతిన్నాయి. వేలాది ఇళ్లు ధ్వంసమయ్యాయి. మరికొన్ని పాక్షికంగా దెబ్బతిన్నాయి. రూ.లక్షలు విలువ చేసే పంటలు నీటిపాలయ్యాయి. కొండచరియలు విరిగిపడటం, వరదలకు రోడ్లు కొట్టుకుపోవడం వంటి కారణాలతో రాష్ట్ర వ్యాప్తంగా మూడు జాతీయ రహదారులు సహా 455 రోడ్లు బ్లాక్ అయ్యాయి. కులు జిల్లాలో 73 రోడ్లు మూసివేశారు. ఆ తర్వాత మండిలో 58, సిమ్లాలో 58 రోడ్లను అధికారులు మూసివేశారు. విద్యుత్ సరఫరా కూడా పూర్తిగా దెబ్బతిన్నది. కులులో 145, సిమ్లాలో 63 సహా మొత్తం 681 ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతిన్నాయి. 182 నీటి సరఫరా పథకాలు ప్రభావితమయ్యాయి. రానున్న రోజుల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. దీంతో అధికారులు అప్రమత్తమయ్యారు. ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. అనవసరమైన ప్రయాణాలను నివారించాలని, వాతావరణ శాఖ అధికారుల సూచనలను పాటించాలని విజ్ఞప్తి చేశారు.

# ట్రంప్ అప్పుడు అధ్యక్షుడిగా ఉండి ఉంటే ఉక్రెయిన్‌తో యుద్ధం జరిగేదే కాదు

- అలాస్కాలో ముగిసిన ట్రంప్-పుతిన్ శిఖరాగ్ర సమావేశం
- ఉక్రెయిన్ యుద్ధంపై ఒప్పందం లేకుండానే ముగిసిన చర్చలు
- ఐదేళ్ల తర్వాత తొలిసారి ముఖాముఖి భేటీ అయిన ఇరు దేశాధి నేతలు
- రెండు దేశాల మధ్య సంబంధాలు మెరుగుపడ్డాయన్న రష్యా అధ్యక్షుడు
- మరోసారి మాస్కోలో కలుద్దామంటూ ట్రంప్‌కు పుతిన్ ఆహ్వానం



అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ 2022లో అధికారంలో ఉండి ఉంటే ఉక్రెయిన్ యుద్ధం అసలు జరిగేదే కాదని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఐదేళ్ల తర్వాత అలాస్కాలో ట్రంప్‌తో తొలిసారి ముఖాముఖి సమావేశమైన సందర్భంగా పుతిన్ ఈ వ్యాఖ్యలు చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. తాను అధ్యక్షుడిగా ఉంటే రష్యా దాడి చేసేది కాదంటూ ట్రంప్ చాలాకాలంగా చేస్తున్న వాదనను పుతిన్ సమర్థించారు. అలాస్కా వేదికగా శుక్రవారం ట్రంప్, పుతిన్‌ల మధ్య జరిగిన ఉన్నతస్థాయి సమావేశం ఎలాంటి ఒప్పందం లేకుండానే ముగిసింది. దాదాపు మూడు గంటల పాటు సాగిన ఈ చర్చల్లో నాలుగేళ్లుగా కొనసాగుతున్న ఉక్రెయిన్ యుద్ధానికి ముగింపు పలికే విషయంపై ఏకాభిప్రాయం కుదరలేదు. సమావేశం అనంతరం పుతిన్ మాట్లాడుతూ.. చర్చల్లో ఉక్రెయిన్ అంశమే ప్రధానంగా ఉందని తెలిపారు. సంఘర్షణ వెనుక ఉన్న అసలు కారణాలను అర్థం చేసుకోవాలన్న ట్రంప్ కోరికను నేను అభినందిస్తున్నాను. యుద్ధాన్ని ముగించడానికి రష్యా చిత్తశుద్ధితో ఉంది. అయితే, దాని మూల కారణాలను తొలగించి, మా ఆందోళనలను కూడా పరిగణనలోకి తీసుకోవాలి'' అని పుతిన్ స్పష్టం చేశారు. చర్చల అనంతరం ఇద్దరు నేతలు మీడియాతో క్లుప్తంగా మాట్లాడారు. 'శాంతిని అనుసరించడం' అనే బ్యానర్ ముందు నిలబడి ట్రంప్ మాట్లాడుతూ.. మేం చాలా అంశాలపై ఏకాభిప్రాయానికి వచ్చాం. కొన్ని పెద్ద విషయాలు పూర్తిగా పరిష్కారం కాలేదు, కానీ పురోగతి సాధించాం. ఒప్పందం కుదిరే వరకు ఏదీ కుదిరినట్లు కాదు అని అన్నారు. కొంతకాలంగా ఇరు దేశాల మధ్య ఉన్న క్లిష్ట పరిస్థితులు తొలగిపోయి, ఇప్పుడు మంచి ప్రత్యక్ష సంబంధాలు ఏర్పడ్డాయని పుతిన్ పేర్కొన్నారు. సమావేశం ముగింపులో, 'తర్వాతిసారి మాస్కోలో కలుద్దాం' అని పుతిన్ సరదాగా అనగా.. 'ఓహ్, అది ఆసక్తికరం. ఈ విషయంలో నాపై విమర్శలు రావొచ్చు, కానీ అది జరిగే అవకాశం ఉంది' అని ట్రంప్ బదులివ్వడం గమనార్హం.

# నాగాలాండ్ గవర్నర్ కన్నుమూత

ఈనాగాలాండ్ గవర్నర్, బీజేపీ మాజీ ఎంపీ ఎల్. గణేశన్ (80) నిన్న సాయంత్రం కన్నుమూశారు. ఈ నెల 8న చెన్నైలోని తన నివాసంలో కుప్పకూలడంతో గణేశన్ తలకు గాయమై ఆసుపత్రిలో చేరినట్లు సమాచారం. వైద్యులు అప్పటి నుంచి ఆయనకు ఐసీయూలో చికిత్స అందించారు. ఆయన అంత్యక్రియలు నేడు (శనివారం) నిర్వహించనున్నారు. గణేశన్ భౌతికకాయాన్ని రాజకీయ నాయకులు, బంధువుల సందర్శనార్థం ఈ రోజు ఉదయం ఆయన నివాసంలో ఉంచుతారు. తంజావూరులో 1945 ఫిబ్రవరి 16న జన్మించిన గణేశన్ చిన్న వయసులోనే ఆర్ఎస్ఎస్ భావజాలం పట్ల ఆకర్షితులయ్యారు. ఆయన తండ్రి, సోదరులకు కూడా ఆర్ఎస్ఎస్‌తో సంబంధాలు ఉండటంతో 1970లో గణేశన్ పూర్తి స్థాయి ప్రచారక్‌గా మారారు. దాదాపు రెండు దశాబ్దాల పాటు మధురై తదితర ప్రాంతాల్లో సంఘ్‌లో సేవలందించి, 1991లో బీజేపీలో చేరి తమిళనాడు పార్టీ శాఖ సంస్థాగత కార్యదర్శిగా సేవలందించారు. తమిళనాట బీజేపీ బలోపేతానికి కృషి చేసిన ఆయన ఆ తర్వాత జాతీయ స్థాయిలో వివిధ హోదాల్లో పని చేశారు. 2006 నుంచి 2009 మధ్య కాలంలో తమిళనాడు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా కూడా బాధ్యతలు నిర్వహించారు. 2016లో మధ్యప్రదేశ్ నుంచి రాజ్యసభకు ఎన్నికయ్యారు. 2021 ఆగస్టులో మణిపూర్ గవర్నర్‌గా నియమితులయ్యారు. 2023లో పశ్చిమ బెంగాల్ గవర్నర్‌గానూ అదనపు బాధ్యతలు నిర్వహించారు. గాలాండ్ గవర్నర్ గణేశన్ మృతి పట్ల ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సహా పలువురు ప్రముఖులు విచారం వ్యక్తం చేశారు. దేశానికి సేవలందించేందుకు తన జీవితాన్ని అంకితం చేసిన నిజమైన జాతీయవాదిగా ఆయన ఎప్పటికీ గుర్తుండిపోతారని ప్రధాని మోదీ పేర్కొన్నారు. తమిళనాడులో పార్టీ బలోపేతానికి ఆయన అవిశ్రాంతంగా కృషి చేశారని మోడీ కొనియాడారు.

# దేశానికి భద్రతా కవచం..

2035 నాటికి రంగంలోకి సుదర్శన చక్ర..



**శ్రీకృష్ణుడి స్ఫూర్తితో దేశానికి సదర్శన చక్ర భద్రతా కవచాన్ని ఏర్పాటు చేయబోతున్నట్టు ప్రధాని నరేంద్ర మోదీ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రకటించారు. 2035 నాటికల్లా ఈ భద్రతా కవచం పనిచేయడం ప్రారంభిస్తుందని, దేశాన్ని శత్రుదుర్భేధ్యంగా మారుస్తామని ప్రకటించారు. ఈ సుదర్శన చక్రం అనేది దీర్ఘ-శ్రేణి రాడార్లు, ఉపగ్రహాల నుంచి నిఘా ఇన్‌పుట్‌లు, విమానాలు, యూఏవీలు, దీర్ఘ-శ్రేణి ఇంటర్‌సెప్టర్ క్షిపణుల సంక్లిష్ట కలయిక. మన దేశం వైపు ప్రత్యర్థుల నుంచి వచ్చే వైమానిక ముప్పు దేన్నైనా తటస్థీకరించగలదు. ఈ సుదర్శన చక్రం భారతదేశ గగనతలాన్ని శత్రు క్షిపణులు, డ్రోన్‌లు, రాకెట్ల నుంచి రక్షిస్తుంది. అదే సమయంలో ఆ దాడికి ప్రతీకారం కూడా తీర్చుకుంటుంది. శత్రువుపైకి మిసైళ్లను సంధిస్తుంది. ఆపరేషన్ సిందూర్ సమయంలో పాకిస్తాన్ ప్రయోగించిన బాలిస్టిక్ క్షిపణులు, సాయుధ డ్రోన్‌లను సుదర్శన చక్రం భారీగా ధ్వంసం చేసింది. ఇలాంటి భద్రతా కవచాలను దేశంలోని ప్రధాన ప్రాంతాలన్నింటిలో ఏర్పాటు చేయబోతున్నారు. కొన్ని నెలల క్రితం ఇరాన్ ప్రయోగించిన 500 బాలిస్టిక్ క్షిపణులలో 498ని ఇజ్రాయెల్ ఈ తరహా వ్యవస్థ ద్వారానే న్యూట్రలైజ్ చేయగలిగింది. భారతదేశం ఇప్పటికే అధునాతన రాడార్ సామర్థ్యాన్ని నిర్మించుకుంది. అయితే వివిధ శ్రేణులు, విభిన్న ఎత్తుల నుంచి వచ్చే క్షిపణులను ఎదుర్కోవడానికి బహుళ శ్రేణి ఇంటర్‌సెప్టర్‌లను అభివృద్ధి చేసుకోవాలి. మిషన్ సుదర్శన్ చక్ర కేవలం రక్షణకు మాత్రమే పరిమితం కాకుండా తిరిగి దాడి చేసే సామర్థ్యాన్ని కూడా కలిగి ఉంది. అయితే శత్రు దేశ టార్గెట్‌లను లక్ష్యంగా చేసుకుని ప్రయోగించే స్వల్ప, మధ్యస్థ, దీర్ఘ శ్రేణి బాలిస్టిక్, క్రూయిజ్ క్షిపణులను అభివృద్ధి చేస్తోంది. సముద్రం, భూమి నుంచి శత్రు నౌకలను లక్ష్యంగా చేసుకోవడానికి భారత నావికాదళానికి దీర్ఘ శ్రేణి క్షిపణులు కూడా అవసరం.**

Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in